

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 20-05-2022 సంపుటి : 03 సంచిక : 242 పేజీలు : 4 వెల : రూ 3-00

## 'బెండపూడి' జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ముచ్చటించిన సీఎం జగన్

తాడేపల్లి: కాకినాడ జిల్లా తొండంగి మండలంలోని బెండపూడి జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థులు.. విదేశీ శైలి ఆంగ్లంతో అనర్గళంగా మాట్లాడి అందరినీ అబ్బురపరిచారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఈ తరహాలో ఇంగ్లిష్‌లో మాట్లాడడం సోషల్ మీడియాలోనూ విపరీతంగా వైరల్ అయ్యింది. 'ఇంగ్లిష్‌పై బెండపూడి జెండా' కథనం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వెళ్లింది ఈ విషయం. ఈ నేపథ్యంలో.. ఆయన స్వయంగా రప్పించుకుని ఆ విద్యార్థులతో ముచ్చటించారు. గురువారం బెండపూడి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు తాడేపల్లికి వెళ్లి.. సీఎం జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా.. వాళ్లతో సీఎం జగన్ సంభాషణ దాదాపుగా ఆంగ్లంలోనే కొనసాగింది. వాళ్ల ప్రతిభను మెచ్చుకుని.. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అందుకోవాలని దీవించారు సీఎం జగన్. మేఘన అనే స్టూడెంట్ తన కిడ్డీ బ్యాంక్‌లోని రూ. 929 సీఎం జగన్‌కు ఇచ్చింది.



అయితే మేఘన నుంచి కేవలం రూ.19 మాత్రమే తీసుకుని మిగతా డబ్బును ఆమెకే ఇచ్చారు సీఎం జగన్. ఈ దృశ్యం అక్కడున్నవాళ్లను ఆకట్టుకుంది.

సీన్ రివర్స్ అయ్యింది: టీచర్

తాను తెలుగు మీడియం విద్యార్థిని కావడంతోనే.. ఇంగ్లిష్‌పరంగా వాళ్లకు ఇబ్బందులు ఎదురు కాకుండా బోధించానని, తద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పట్టు వచ్చిందని విద్యార్థుల కూడా వచ్చిన ప్రభుత్వ టీచర్ తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులంతా నిబద్ధతతో పని చేస్తున్నారని తెలిపారాయన. గత రెండేళ్లలో సీన్ రివర్స్? అయ్యిందని, కార్పొరేట్.. ప్రైవేట్ స్కూళ్లలోనూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వీడియోలను ప్రదర్శిస్తుండగా విశేషం అని చెప్పారాయన.

## ఏపీలో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలు ప్రారంభం



అమరావతి: పశుపోషకుల ఇంటిముంగిటే మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలందించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవలు నేటి (గురువారం) నుంచి అందుబాటులోకి వచ్చాయి. సుమారు రూ.278 కోట్ల వ్యయంతో మొత్తం 340 పశువుల అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తుండగా.. తొలిదశలో రూ.143 కోట్లతో సిద్ధం చేసిన 175 అంబులెన్స్‌లను తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య వాహనాల్లో ఉన్న సదుపాయాలను సీఎం జగన్ అడిగి తెలుసుకున్నారు.మలిదశలో రూ.135 కోట్లతో 165 అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు చొప్పున 108 అంబులెన్స్ సేవల తరహాలోనే అత్యాధునిక సౌకర్యాలతో ఈ

**తొలిదశలో రూ.143 కోట్లతో 175 అంబులెన్స్‌లు**
**టోల్ ఫ్రీ నంబరు 1962కు ఫోన్‌చేస్తే చాలు రైతు ముంగిటే సేవలు**
**తాడేపల్లి క్యాంప్ కార్యాలయం వద్ద ప్రారంభించిన సీఎం జగన్**



అంబులెన్స్‌లను తీసుకొస్తున్నారు. వీటి నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుంది. అంబులెన్స్ సేవల కోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబరు 1962 ఏర్పాటు చేశారు.ఫోన్ చేసి పశువు అనారోగ్య సమస్య వివరిస్తే చాలు.. అంబులెన్స్‌లో రైతు ముంగిటకు వెళ్లి వైద్యసేవలందిస్తారు. అవసరమైతే పశువును దగ్గరలోని ఏరియా పశువైద్యశాలకు లేదా వెటర్నరీ పాలీక్లినిక్‌కు తరలించి మెరుగైన వైద్యసేవలందించి తిరిగి ఆ పశువును సురక్షితంగా రైతు ఇంటికి ఉచితంగా చేరుస్తారు. ప్రస్తుతం ఈ అంబులెన్స్‌లు విజయవాడ నున్న సమీపంలోని ముస్తాబాద శివారు ప్రాంతంలో బారులు తీరి ఉన్నాయి.

## ప్రజల్లో భరోసా కల్పించాలి : చంద్రబాబు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని , ప్రభుత్వం విధిస్తున్న పన్నులు ,పెంచుతున్న ధరల వల్ల విసుగెత్తిపోయారని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజల్లో టీడీపీపై విశ్వాసం పెంచేలా టీడీపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి తామున్నామంటూ భరోసా కల్పించాలని పిలుపునిచ్చారు.కర్నూలు జిల్లా కేంద్రంలో కర్నూలు, నంద్యాల జిల్లాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో బాబు మాట్లాడారు. " 40 ఏండ్లుగా టీడీపీని భుజాలు అరిగిపోయే విధంగా జెండాలు



మోసారు. ప్రత్యర్థులు చేతిలో బలైన టీడీపీ కుటుంబ సభ్యులు బెదరకుండా పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేశారు. ఎన్టీఆర్ వేసిన ఫౌండేషన్ తెలుగు జాతీ ఉన్నంతవరకు టీడీపీ ఉంటుంద" ని పేర్కొన్నారు. పార్టీని దెబ్బతీసేందుకు కుట్రలు పన్నిన నాయకులు కాలగర్భంలో కలిసిపోయారని వెల్లడించారు.ఇదే నెలలో ఒంగోలులో నిర్వహించనున్న పార్టీ ఆవిర్భావ సభ లో పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన విధానాలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గడిచిన మూడేండ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసిన తప్పులను ప్రశ్నించే వారిపై పోలీసులు కేసులు పెట్టడం దారుణమని అన్నారు. టీడీపీ శ్రేణులు తలుచుకుంటే పోలీసులు ఏం చేయలేరని వెల్లడించారు. టీడీపీ జెండాలను తొలగించి వైసీపీ జెండాలను పెట్టడం తగదని అన్నారు. రాజకీయ పార్టీలను ప్రభుత్వం సమానంగా చూడాలని హితవు పలికారు. కేసులు పెడితే భయపడబోమని అన్నారు.బాదుడే బాదుడు కార్యక్రమం కింద ప్రతీ కార్యకర్త ఇంటింటికి వెళ్లి ప్రజలకు తామున్నామంటూ భరోసా కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయలను సంపాదించారని ఆరోపించారు. అలాంటి వ్యక్తి తనను విమర్శించే హక్కులేదని అన్నారు.

## బీసీలకు సీఎం జగన్ మాత్రమే న్యాయం చేశారు: మంత్రి ధర్మాన

తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 26 నుంచి 29 వరకు మంత్రుల బస్సు యాత్ర జరుగనుంది. ఈ నేపథ్యంలో గురువారం బస్సు యాత్రపై రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. "సామాజిక న్యాయం అనే బస్సు యాత్రను వైఎస్సార్ కాంగ్రెస్ చేపట్టబోతున్నది. శ్రీకాకుళం నుంచి బస్సు యాత్ర ప్రారంభం కాబోతుంది. నాలుగు రోజుల పాటు ఈ యాత్ర సాగుతుంది.దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాధికారం ఇస్తున్న ప్రభుత్వం మాది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్య, సామాజిక అభివృద్ధికి మూడేళ్లుగా కంకణం కట్టుకున్నారు. బండ చాకిరి సమాజం కోసం చేస్తూ పాలన అందనంత దూరం ఉన్న వర్గాలు ఇవి. అలాంటి వారికి అధికార బదిలీ సీఎం జగన్ పాలనలో జరిగింది. ఈ



విషయాలు రాష్ట్రమంతా చెప్పాలనే బస్సు యాత్ర చేస్తున్నాం. ఇలాంటి వర్గాలను గౌరవించకుండా మోసగించిన వాళ్లు ప్రజల మధ్యకు వెళ్లి మేము ఏమీ చేయలేదని చెప్తున్నారు. అందుకే మేమే ప్రజల్లోకి వెళ్లి ఏమీ చేశామో సామాజిక విప్లవం ఎలా జరిగిందో చెప్తాం. బస్సు యాత్ర శ్రీకాకుళంలో ప్రారంభమై అనంతపురంలో ముగుస్తుంది. రోజుకో పెద్ద బహిరంగ సభ ఉంటుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రతినిధులు అందరూ పాల్గొంటారు. కేబినెట్‌లో 77 శాతం సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉన్నారు. ఇలాంటి దాన్ని అభాసుపాలు చేయడానికి ప్రతిపక్షం ప్రయత్నిస్తోంది. రాజ్యసభ సీటును ఒక తెలంగాణ బీసీ వ్యక్తికి ఇస్తే తప్పు పడుతున్నారు. ఎక్కడున్నాడు అనేది కాదు.. ఆయా వర్గాల ఘోష వినిపించే వ్యక్తి కావాలి. చంద్రబాబు ఎక్కడు ఉంటున్నారు..? తెలంగాణలో కాదా..?. ఆబ నిధులు 80 శాతం అణగారిన వర్గాలకే వెళ్తోంది. ఏ రోజైనా టీడీపీ బీసీలకు ఒక్క రాజ్యసభ సభ్యత్వమైనా ఇచ్చిందా.? ధరల పెరుగుదల అంటున్నారు.. ఒక్క ఏపీలోనే పెరిగాయా...? దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ధరలు పెరిగాయి. ఐదేళ్లు మీరు ఒక ఫెయిల్యూర్ గవర్నమెంట్ నడిపారు. మాలాంటి వారు ప్రజలకు ఇవన్నీ చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది" అని అన్నారు. అనంతరం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోరిన సమ సమాజాన్ని సీఎం వైఎస్ జగన్ చేసి చూపించారు. సీఎం జగన్ చేతల్లో చూపించిన విప?లవాన్ని ప్రజలకు వివరిస్తాం. 26న విజయనగరం, 27న రాజమండ్రి, 28న నరసరావుపేట, 29న అనంతపురంలో బహిరంగ సభలు జరుగుతాయని తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లలో ఘరానా మోసం : సోము వీర్రాజు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రైతుల వద్ద నుంచి చేస్తున్న ధాన్యం కొనుగోలులో ఘరానా మోసం జరుగుతుందని ఏపీ బీజేపీ చీఫ్ సోము వీర్రాజు ఆరోపించారు. ఈ మోసాలపై విచారణ చేపట్టాలని ఏపీ సీఎంజగన్‌కు ఇవాళ ఓ లేఖను రాశారు. ధాన్యం కోనుగోళ్ల వ్యవహారంలో అక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని మొదటి నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నా కనీసం స్పందించడం లేదని విమర్శించారు. స్వయాన సొంత పార్టీకి చెందిన ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ ధాన్యం మాఫియాపై చేసిన వ్యాఖ్యలకైనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



75 కిలోల ధాన్యం బస్తాకు రూ. 1455 చెల్లించాల్సి ఉండగా రూ. 1200 కంటే తక్కువ చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కాకుండా మిల్లర్ల వద్దకు మొత్తం ధాన్యం వెళ్లే విధంగా క్షేత్రస్థాయిలో అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ దోపిడి వెనుక ఉన్న వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ధాన్యాన్ని రీమిల్లింగ్ చేసే మాఫియాపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఏపీలో ఇద్దరు ఐపీఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రెండు రోజుల క్రితం బదిలీ చేసిన ఐపీఎస్ అధికారుల్లో ఇద్దరికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఐపీఎస్ అధికారి గుల్జార్‌కు వాణిజ్య పన్నులు, చేనేత ? జౌళి శాఖలు, చిరంజీవి చౌదరికి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల అదనపు బాధ్యతలు అప్పగించారు.విశాఖపట్నం రేంజి డీఐజీ ఎస్. హరికృష్ణకు తీర ప్రాంత భద్రత విభాగం డీఐజీగా అప్పగించారు. కాకినాడ ఎస్పీ ఎం. రవీంద్రనాథ్‌బాబుకు కాకినాడలోని ఏపీఎస్పీ మూడో బెటాలిన్ కమాండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు, అనంతపురంలోని ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్ అజిత వేజెండ్లకు గుంతకల్లు రైల్వే పోలీసు ఎస్పీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే.

## ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభం.. ఐక్యరాజ్యసమితి వార్నింగ్

న్యూయార్క్: ఉక్రెయిన్‌పై రష్యా ఆక్రమణకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా రాబోయే రోజుల్లో ఆహార సంక్షోభం ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి వార్నింగ్ ఇచ్చింది. యుద్ధం వల్ల పేద దేశాల్లో ధరలు పెరిగాయని, దీంతో ఆహార అభద్రత ఏర్పడినట్లు సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ తెలిపారు. ఉక్రెయిన్ నుంచి ఎగుమతులు ప్రారంభం కాకుంటే



ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆహార కొరత ఏర్పడే ఛాన్సు ఉందన్నారు. రష్యా, ఉక్రెయిన్ వార్ వల్ల నౌకాశ్రయాలకు సరఫరా నిలిచిపోయింది. ఉక్రెయిన్ నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్‌తో పాటు గోధుమలు, మొక్కజొన్నలు, పప్పు దినుసులు అధిక మొత్తంలో సరఫరా అవుతాయి. అయితే పోర్టుల్లో నౌకలు స్తంభించడంతో.. ఆహార ధాన్యాల సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా నిత్యావసర వస్తువులు ధరలు పెరుగుతున్నాయి.గత ఏడాదితో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా ఆహార పదార్థాలు ధరలు దాదాపు 30 శాతం పెరిగినట్లు యూఎన్ తెలిపింది. పోషకాహార లోపం, కరువు, ఆకలిబాధలతో లక్షలాది మంది బాధపడుతారని గుటెర్రస్ తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో కావాల్సినంత ఆహారం ఉందని, ఈ సమస్యను ఇప్పుడు పరిష్కరించకుంటే, రాబోయే నెలల్లో గ్లోబల్ ఫుడ్ షార్టేజ్ ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. ఉక్రెయిన్‌లో ఆహార ఉత్పత్తి మళ్లీ పెరగాలని, ఇంకా రష్యా, బెలారస్ నుంచి ఫెర్టిలైజర్లు కూడా అధిక మొత్తంలో మార్కెట్లోకి వస్తేనే ప్రపంచం గాడిలో పడుతుందని గుటెర్రస్ చెప్పారు.

## నిస్వార్థ ప్రజా నాయకుడు నీలం సంజీవ రెడ్డి

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి గా అవినీతిరహిత పరిపాలన**
**స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన రాయలసీమ రాజకీయ ఆణిముత్యం**
**నేడు భారత దేశ ఆరవ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి**
**ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్**

విజయవాడ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణలో నీలం సంజీవరెడ్డిది ప్రముఖపాత్ర అని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్ అన్నారు. భారత దేశ ఆరవ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతిని పురస్కరించుకుని గురువారం విజయవాడ ఆంధ్ర రత్న భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. నీలం సంజీవరెడ్డి భారత రాష్ట్రపతి గా, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి గా, లోక్‌సభ సభాపతి గా, ఆంధ్ర రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, సంయుక్త మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా, కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడిగా వివిధ పదవులను అలంకరించి, ప్రజల మన్ననలను పొందిన రాజకీయవేత్త అని శైలజనాథ్ కొనియాడారు. 1929 లోనే మహాత్మా గాంధీ స్ఫూర్తితో చదువును పక్కనపెట్టి రాజకీయాల్లో చేరి స్వాతంత్ర్య పోరాటం వైపు దృష్టి సారించి 1937లో ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెసు కమిటీకి కార్యదర్శిగా ఎన్నికై దాదాపు పదేళ్ళపాటు ఆ పదవిలో కొనసాగారని శైలజనాథ్ గుర్తు చేశారు, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారని చెప్పారు. 1940, 1945 ల మధ్య ఎక్కువకాలం సంజీవరెడ్డి జైలులో ఉన్నారని, 1946లో మద్రాసు శాసనసభకు ఎన్నిక కాగా 1947లో రాజ్యాంగ నిర్మాణ సంఘమైన రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారని వివరించారు.రాష్ట్ర స్థాపనలో ప్రధాన, నిర్ణాయక ఘట్టమైన పెద్దమనుషుల ఒప్పందంలో ఆంధ్ర తరపున అప్పటి ఆంధ్ర ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రిగా ఉన్న సంజీవరెడ్డి కూడా పాల్గొని ఒప్పందంపై సంతకం పెట్టారని, ఆంధ్ర ప్రదేశ్ అవతరించాక, కాంగ్రెసు శాసనసభాపక్ష నాయకుడిగా మరియు తొలి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. 1960లో అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షపదవికి ఎన్నికవడంతో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారని, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండేళ్ళు పనిచేసి మళ్ళీ 1962లో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రవాణా సంస్థల జాతీయాకరణ వివాదంలో సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుబట్టడంతో 1964 ఫిబ్రవరి 29 న తనపదవికి రాజీనామా చేసారని గుర్తుచేశారు.ఒక్క సారి ఎం.ఎల్.ఎ అయితే కోట్లకి పడగలు ఎత్తే రాజకీయ వారసత్వాన్ని ప్రోత్సహిస్తున్న తరుణంలో వాటిని వ్యతిరేకించి ఎలాంటి హంగు ఆర్భాటాలకు పోకుండా నిస్వార్థ సేవలు అందించిన ప్రజా నాయకుడు నీలం సంజీవ రెడ్డి అని పేర్కొన్నారు. ముఖ్యంగా లోకసభాపతిగా ఎన్నిక కాగానే తన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి అధికార పక్షంతో పాటు ప్రతి పక్షం మంచి వాతావరణం ఏర్పరచి స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన రాయలసీమ రాజకీయ ఆణిముత్యం మన నీలం సంజీవరెడ్డి అని శైలజనాథ్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 20-05-2022

## ఉన్నత స్థానాల్లోకి ఎదిగినా... ఇంకానా...

దేశంలో అవినీతి ఆరోపణలు రాజకీయ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రుల మీదనే కాదు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపైన కూడా ఉన్నాయి. కొందరు జైలు పాలు కూడా అయ్యారు. దేశంలో 6,553 మంది సివిల్స్ అధికారులు ఉండగా 5,104 మంది సర్వీస్‌లో ఉన్నారు. 2014 నుంచి ఇప్పటిదాకా 44 మంది ఐఏఎస్, 12 మంది ఐపీఎస్ అధికారుల మీద ఐటీ, ఈడీ, సీబీఐ, ఏసీబీ కేసులు ఉన్నాయి. 2019-2020 నాటికి దేశంలో ఐఏఎస్ అధికారుల మీద 753 కేసులు నమోదయ్యాయి. ఐఏఎస్ అధికారుల సంఖ్యలో 12 నుంచి 13 శాతం మంది మీద అవినీతి ఆరోపణల కేసులు ఉన్నాయి. టాప్ టెన్ అవినీతిపరులలో నితేష్ జనార్ధన్ ఠాకూర్, అరవింద్ జోషీ, టినూ జోషీ, నీర యాదవ్, బాబూలాల్ అగర్వాల్ ,ప్రతాప్ సింగ్, టీఓ సూరజ్, పవన్, పహాడియా, నిర్మలా మీనా తదితరులు ఉన్నారు. కనీసం 200 కోట్ల నుంచి 500 కోట్ల దాకా డబ్బు, బంగారం, ఇతర అక్రమ ఆస్తులు వీరి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. మంత్రులు, సీఎంలు సైతం వీరి వెనక ఉంటారు. ప్రతీ ఐఏఎస్ సంతకం వెనక ఒకరి ఆదేశం ఒత్తిడి లేదా న్యాయం, అన్యాయం, అవినీతి ఉంటుందని అంటారు. మెజారిటీ ఐఏఎస్‌లు నిజాయితీపరులే. కీలక ఫోకల్ పాయింట్స్‌లో నీతి పరులకు తక్కువ అవకాశాలే ఉంటాయి. 2017లో 623 కేసులు నమోదు కాగా, 2015లో 16 కేసులు మాత్రమే నమోదు అయ్యాయి. ఈ విషయాలన్నీ ప్రస్తుతం చర్చకు రావడానికి కారణం ఏమంటే, తాజాగా ఝార్ఖండ్‌లో 22 ఏండ్లుగా పని చేస్తున్న ఐఏఎస్ అధికారి పూజా సింఘాల్ వద్ద 17 కోట్ల రూపాయల నగదు, ఇతర అక్రమ ఆస్తులు ఈడీ దాడిలో బయట పడ్డాయి. ఎనిమిది కోట్ల రూపాయలు ఆమె పీఏ వద్ద పట్టుకున్నారు. సహజంగా ఐఏఎస్‌లకు బినామీలు ఎక్కువగానే ఉంటారు. ఈమె భర్తకు పెద్ద ఆసుపత్రి ఉంది. ఈ డబ్బును అటు చూపుతారనే ప్రచారం కూడా ఉంది. ఆమె మామను అరెస్ట్ చేసారు. 25 కోట్ల బినామీ ఆస్తులను గుర్తించారు. ఝార్ఖండ్‌లోని మైనింగ్, ఇతర విభాగాలలో కీలక పదవులలో ఈమె పని చేసారు. 2000 సంవత్సరం ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈమె 18 కోట్ల రూపాయల ఉపాధిహామీ పథకంలో ఒక ఎన్‌జీఓ నుంచి ఆరు కోట్లు తీసుకుని అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. తన నుంచి డబ్బులు అడుగుతున్నారని ఒక మైనింగ్ కాంట్రాక్టర్ సీఎంకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. రఘువరదాస్ సీఎంగా ఉన్నా హేమంత్ సోరెన్ సీఎంగా ఉన్నా ఆమెకు అందరి అండదండలు లభించాయి. అలాంటిది ఇప్పుడు అకస్మాత్తుగా ఈ రైడ్ సంచలనం కలిగించింది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ ఎవరు అయినా ఎంతో పవిత్రముగా ఉండాలి. సమాజంలో వారికీ మంచి గౌరవం ఉంటుంది. కేసులుండి జైలుకు వెళ్లినవారిలో పలువురు సస్పెండ్ అయ్యారు. కొందరు డిస్మిస్ కూడా అయ్యారు. కొందరు పదవులు వదిలి, మరి కొందరు రిటైర్ అయ్యాక రాజకీయాలలోకి వచ్చారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు అయ్యారు. ఐఏఎస్‌ల మీద అవినీతి కేసులు అంటే ఆత్మహత్యా సదృశ్యమే. కొందరు కన్ఫర్డ్ ఐపీఎస్‌లు రాజకీయ నేతల కనుసన్నలలో మెదులుతారనే విమర్శలు ఉన్నాయి. 'మీరు మారాలి. మీరు ఇంతే అయితే ఈ దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితికి ఎవరు జవాబుదారి అవుతారో చెప్పండి' ప్రభుత్వాలు మారుతుంటాయి. రాజకీయ పార్టీల నేతలకు అనుకూలంగా వ్యవహరించడం వలన రాజ్యాంగం అమలు సరిగా జరగదు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు సిద్ధించే అవకాశాలు ఉండవు. సామాన్యుడికి న్యాయం లభించదు. ప్రశ్నించేవాడిని 'దేశద్రోహి' అంటూ కేసులు పెట్టి జైలులోకి నెడుతున్నారు. యూపీలోని లఖీంపూర్ ఖేరిలో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కొడుకు ఆశిష్ మిశ్రా తన జీబుతో రైతులను తొక్కి చంపిన కేసులో జైలు నుంచి బయటకు వచ్చాడు. అతడు కోర్టుకు పోలీసుల సమక్షంలో మీసాలు మెలి వేసుకుంటూ వచ్చిన తీరు ఈ దేశంలో నేరస్తుల విచ్చలవిడితనాన్ని స్పష్టం చేస్తోంది. ఇలాంటి వారికీ చట్టం అన్నా, అధికారులు అన్నా గౌరవం, భయం లేదు. ఇలాంటి వారిని అధికార పార్టీలు పెంచి పోషిస్తున్నాయి. ఇలాంటి వాటికి దృశ్యాలకు కారణం ఎవరు? దేశం అసమానతలు, ఆకలి, నిరుద్యోగం, అధిక ధరలతో అట్టుడికి పోతున్నది. ఆర్థిక ఇబ్బందులు, అప్పులు, ప్రైవేటీకరణతో కోట్ల మంది ఉద్యోగులు రోడ్ల మీదికి వచ్చిండ్రు. 'డబ్బు ఉన్నవాడికి మాత్రమే సంపద సొంతం' అనే విధంగా అదాని, అంబానీలాంటి వారి సంపాదనకు అంతే లేదు. ఎన్నికలలో గెలవడం, రాజ్యాధికారాన్ని కాపాడుకోవడం కోసం 80-20 రాజకీయాలు, మైండ్ గేములు, ఒక వర్గం మీద దాడులు, బుల్‌డోజర్‌లతో కూల్చివేతలు షరామామూలు అయిపోయాయి. ఇలాంటి సందర్భాలలో ప్రజలకు లభించాల్సిన మానవహక్కులు, ఇప్పించాల్సిన అధికారులు సైతం అధికార పార్టీలకు వంత పాడితే ఎట్లా? ప్రమాణాలు ఏం కావాలి? దేశాన్ని పాలిస్తున్న పార్టీలు, నేతలు తప్పు దారి పట్టినవుడు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నపుడు వారిని దారిలో పెట్టాల్సినవారు వంత పాడినా, మౌనంగా ఉన్నా తప్పు అవుతుంది. ఏది ఏమైనా నిజాయితీగా ప్రజల వైపు ఉండి, రాజకీయ పార్టీల నేతలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ, ప్రభుత్వాలను దారిలో పెట్టే ప్రయత్నాలు చేస్తూ, పేద పీడిత తాడిత జనం మేలు కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న అధికారులకు అభినందనలు.

# రెండు పార్టీలదే హవా..

విజయవాడ, మే 19, ఆంధ్ర ప్రదేశ్ లో రాజకీయం మొత్తం ఆ రెండు పార్టీల మధ్యనే తిరుగుతోంది. అయితే, టీడీపీ కాదంటే వైసీపీ. ఈ రెండు ప్రాంతీయ పార్టీలే రాష్ట్ర రాజకీయలను శాసిస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాలనే ప్రామాణికంగా తీసుకుంటే, ఆ రెండు పార్టీలకు కలిపి 90 శాతానికి పైగా ఓట్లు (వైసీపీ 49.15 శాతం, టీడీపీ 39.58 శాతం) పోలయ్యాయి. కాంగ్రెస్, బీజేపీ, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, జనసేన సహా ఇతర పార్టీలు అన్నిటికీ కలిపి పది శాతానికి కొంచెం అటూ ఇటుగా మాత్రమే ఓట్లు పోలయ్యాయి. అంటే, భవిష్యత్ సంగతి ఎలా ఉన్నా ఇప్పటికి అయితే తమిళనాడు తరహాలో ఏపీలోనూ ప్రాంతీయ పార్టీలదే పైచేయి అని తేలిపోయింది. అలాగే, రెండు పార్టీల వ్యవస్థ దిశగా ఏపీ అడుగులు వేస్తోందనే అభిప్రాయం బలపడుతోంది. అయితే, ఇటీవల కాలంలో నేనున్నానంటూ, పవన్ కళ్యాణ్ పార్టీ జనసేన కొంత సందడి చేస్తోంది. కానీ, సినిమా స్టార్ పవన్ కళ్యాణ్ ఎంత సందడి చేసినా, జనసేన ఒంటరిగా పోటీ చేస్తే తమిళనాడులో కమల్ హాసన్ కు ఎదురైన అనుభవమే ఎదురవుతుందని, పవన్ అభిమానులే అంటున్నారు. అలాగే, జనసేన ఒంటరిగా పోటీ చేసినా లేక ఉందో లేదో తెలియకుండా ఉన్న బీజేపీతో పొత్తు కొనసాగించినా, ఫలితం తారుమరయ్యే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు గట్టిగా భావిస్తున్నారు. నిజానికి ఈ నిజం జనసేన, పవన్ కళ్యాణ్ గుర్తించారు. అందుకే, వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూసే బాధ్యత తాను తీసుకుంటానని ఆయన తమ పార్టీ ఆవిర్భావ సభలో ప్రకటించారు. ఒక విధంగా పవన్ ప్రకటన తమ క్యాడర్ లో విశ్వాసం నింపేందుకే అని అభిప్రాయం కూడా పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అందుకే అనివార్యంగానే పవన్ కళ్యాణ్ ఆ ప్రకటన చేశారని అంటారు. అయితే, ఆ దిశగా జనసేన తరపు నుంచి ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. అయినా, పార్టీ క్యాడర్ లో అదే విధంగా జనంలో మాత్రం పొత్తుల విషయంలో స్పష్టత ఉందని పరిశీలకులు అంటున్నారు. సుమారు 40 శాతం ఓటుతో పాటు సంస్థాగత నిర్మాణం ఉన్న టీడీపీ లేకుండా వైసీపీని ఎదుర్కోవడం అయ్యే పనికాదని జనసేన క్యాడర్ మాత్రమే కాదు సామాన్య ప్రజలు సైతంస్పష్టం చేస్తున్నారు. వైసీపీని ఓడించే శక్తి ఒక్క టీడీపీకి మాత్రమే ఉందని, రాజకీయ కార్యకర్తలు, సామాన్య ప్రజలు కూడా అర్థం చేసుకున్నారు. అదే విధంగా, ఇటు టీడీపీ, జనసేన కార్యకర్తలకు కూడా క్లారిటీ ఉందని, అందుకే, టీడీపీతో పొత్తు పై మరింత స్పష్టత ఇవ్వాలని జనసేన స్థానిక నాయకుల పై ఆ పార్టీ క్యాడర్ వత్తిడి తెస్తోంది. అలాగే, క్రింది స్థాయిలో ఇప్పటి నుంచే ఉభయ పార్టీల కార్యకర్తలు కలిసి పనిచేస్తున్నారని, అదే విధంగా స్థానిక నాయకులు కూడా, భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని, కలిసి మెలసి పనిచేస్తున్నారని తెలుస్తోంది. నిజానికి, జనసేన, బీజేపీ మధ్య పొత్తు ఉన్నా, జనసేన క్యాడర్ టీడీపీతో, టీడీపీ క్యాడర్ జనసేనతో కలిసి పనిచేయడం వైపే మొగ్గు చూపుతున్నారు. బీజేపీ కలిసి వస్తే వస్తుంది లేదంటే లేదు, అవసరం అయితే వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలను కలుపుకుని అయినా ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా, చూడాలని జనసేన నాయకత్వం భావిస్తోంది. నిజానికి బహిరంగ ప్రకటన లేక పోయినా జనసేన, స్థానిక నాయకులు ఆ దిశగా ఇప్పటికీ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే పార్టీలతో సంబంధం లేకుండా, ప్రజలే, టీడీపీ పునాదిగా వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక వేదికను సిద్దం చేస్తున్నారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. నిజానికి, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో విసుగెత్తిన అన్ని వర్గాల ప్రజలు అటో ఇటో తేల్చుకోవాలని రాజకీయ పార్టీలను హెచ్చరిస్తున్నారు. సో.. పార్టీ పొత్తులు వ్యవహారం ఎలా ఉన్నా ప్రజలు మాత్రం ఇప్పటికే, ఒకటయ్యారని పరిశీలకులు భావిస్తున్నారు.

# ఆర్కే గూడు చెదిరిందా

గుంటూరు మే 19,గత ఎన్నికల్లో జెయింట్ కిల్లర్స్ గా నిలిచి వైసీపీ విజయంలో కీలక రోల్ ప్లే చేసిన నేతలెవరూ ఈ సారి వైసీపీ అభ్యర్థులుగా ఆ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు సిద్ధ పడటం లేదు. గత ఎన్నికలలో పవన్ కళ్యాణ్ పై విజయం సాధించిన గ్రంధి శ్రీనివాస్ జగన్ తీరుపై తన అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసేదే లేదంటూ తన సన్నిహితుల దగ్గర చెప్పుకుంటున్నారు. ఇప్పుడు ఆయన కోవలోకే మరో జెయింట్ కిల్లర్, మంగళగిరి స్థానం నుంచి తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పై విజయం సాధించిన ఆర్కే చేరారు. ఈ సారి తాను పోటీలో ఉండననీ, మంగళగిరి స్థానాన్ని బీసీలకు వదిలేస్తాననీ ప్రకటించారు. అయితే ఆయన పోటీ చేయనని ప్రకటించడానికి కారణం బీసీలపై ప్రేమ కాదనీ, పోటీలో దిగినా పరాజయం తప్పదన్న భయమేననీ పరిశీలకులు అంటున్నారు. గత ఎన్నికలలో ఆర్కే తెలుగుదేశం అభ్యర్థి లోకేష్ పై దాదాపు 5 వేల ఓట్లతో విజయం సాధించారు. అప్పటికీ, ఇప్పటికీ నియోజకవర్గంలో పరిస్థితిలో బాగా మార్పు వచ్చిందని పరిశీలకులు చెబుతున్నారు. గత ఎన్నికలలో లోకేష్ విజయం సాధిస్తే ఏమేం జరుగుతాయని జనాలను భయపెట్టి ఓట్లు దండుకున్నారో.. అవన్నీ జగన్ హయాంలో జరగడంతో ఈ సారి ఆర్కేకు ఓట్లు రావడం అంత సులువు కాదని అంటున్నారు. ఆ గ్రహింపుతోనే బీసీలకు వదిలేస్తానంటూ పోటీ నుంచి తప్పుకుని పరువు కాపాడుకోవాలన్న ఉద్దేశంతోనే ఆర్కే ఈ నిర్ణయానికి వచ్చారని వివరిస్తున్నారు. నిజానికి గత ఎన్నికలలో ఆర్కే విజయానికి ఆయన సత్తా కంటే.. ఫ్యాన్ గాలి, ప్రత్యర్థి పార్టీలలో ఓట్ల చీలిక కారణమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మంగళగిరి నుంచి పోటీ చేయాలని లోకేష్ అప్పట్లో తీసుకున్న నిర్ణయం సాహసోపేతమని అప్పట్లోనే పరిశీలకులు పేర్కొన్న సంగతి విదితమే. ఎందుకంటే మంగళగిరి స్థానం నుంచి తెలుగుదేశం అభ్యర్థి నిలబడిన స్థందర్భాలు చాలా తక్కువ. ఎప్పుడూ పొత్తులలో భాగంగా ఆ స్థానాన్ని వామపక్ష పార్టీలకు కేటాయించడాన్ని తెలుగుదేశం ఒక ఆనవాయితీగా కొనసాగిస్తూ వచ్చింది. ఎందుకంటే అక్కడ వామపక్ష పార్టీలకు ఒకింత పట్టు ఉంది. వామపక్ష పార్టీలు, జనసేన పొత్తు పెట్టుకుని ఆ ఎన్నికలలో పోటీ చేయడంతో ఓట్లు భారీగా చీలాయి. అంతే కాకుండా మంగళగిరిలో తెలుగుదేశం విజయావకాశాలు సంక్షిష్టమన్న నివేదికలను సైతం ఖాతరు చేయకుండా లోకేష్ సాహసం చేసి అక్కడే పోటీకి సిద్ధ పడ్డారు. ఆ ఎన్నికలలో 5 వేల ఓట్లతో లోకేష్ పరాజయం పాలయ్యారు. అక్కడ జనసేన, వామపక్షాల ఉమ్మడి అభ్యర్థికి పది వేల ఓట్లు వచ్చాయి. అంటే ఆర్కే విజయానికి ఓట్ల చీలికే కారణమని నిర్ధారణ అయ్యింది. అయితే ఇప్పుడు నాటికీ నేటికీ పరిస్థితుల్లో బాగా మార్పు వచ్చింది. విజయం తరువాత ఆర్కే ప్రజలకు అందుబాటులో లేకపోవడం, కరకట్టపై ఇళ్లు కూల్చేస్తారంటూ జనాలను అప్పట్లో భయపెట్టి విజయం సాధించిన ఆర్కే.. తాను గెలిచిన తరువాత ఇళ్ల కూల్చివేతను దగ్గరుండి చేయించడంతో ప్రజలు ఆయనపై ఆగ్రహంతో ఉన్నారు. మరో వైపు లోకేష్.. ఓడిన చోటే గెలవాలన్న పట్టుదలతో అక్కడి నుంచే పోటీ చేస్తానని ప్రకటించి.. ఓ నియోజకవర్గ ఇంచార్జిగా మంగళగిరిలో ప్రజలలో మమేకమౌతున్నారు. అలాగే గ్రామాల వారీగా పార్టీ పటిష్టతపై దృష్టి పెట్టారు. గతంలో సీఎం కుమారుడిగా.. మంత్రిగా ఆయన చుట్టూ సెక్యూరిటీ ఉండేది.. దాంతో ఆయన జనంతో ఇప్పటిలా మమేకం కాలేకపోయారు. అయితే ఇప్పుడు అలాంటి సెక్యూరిటీ లేకపోవడంతో లోకేష్ జనంతో మమేకమై నేరుగా వారితో ఇంట్రాక్ట్ అవుతూ సమస్యలు తెలుసుకుంటున్నారు. ఇది రానున్న ఎన్నికలలో లోకేష్ కు సానుకూలతను పెంచిందని పరిశీలకులు అంటున్నారు.

# ఐదేళ్లలోనే రావెల 3 పార్టీలు..



విజయవాడ, మే 19, తెలుగు రాష్ట్రాల్లో పట్టు సాధించడానికి ఆరాటపడుతోన్న బీజేపీకి ఏపీలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెల కిషోర్ బాబు కమలం కండువా తీసేశారు. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆయన ఎట్టకేలకు పార్టీకి గుడ్ బై చెప్పారు. మోడీపై అభిమానం ఉన్నప్పటికీ వ్యక్తిగత కారణాల వల్ల పార్టీని వీడుతున్నానంటూ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు రావెల. కాగా టీడీపీ ప్రభుత్వంలో మూడేళ్లపాటు మంత్రిగా పని చేసిన ఆయన తిరిగి సొంత గూటికి చేరేందుకు నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు సన్నిహితులతో కలిసి పావులు కదుపుతున్నట్టు సమాచారం. సివిల్స్ రాసి ఐఆర్ఎస్ కు ఎంపికైన రావెల కిషోర్ బాబు.. వివిధ ప్రభుత్వ శాఖల్లో సీనియర్ లెవెల్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2014 లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి, టీడీపీ తరపున గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేశారు. వైసీపీ అభ్యర్థి మేకతోటి సుచరితపై గెలుపొందారు. చంద్రబాబు కేబినెట్ లో మూడేళ్లపాటు మంత్రిగా కొనసాగారు. పనితీరు సరిగా లేదన్న అభియోగాలు రావడంతో చంద్రబాబు ఆయన్ను తప్పించి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబుకు ఆ బాధ్యతలు అప్పగించారు. దీంతో హర్ట్ అయిన రావెల జనసేన పార్టీ తీర్థం పుచ్చుకుని ప్రత్తిపాడు నుండి 2019 ఎన్నికల బరిలో నిలిచారు. వైసీపీ సునామీలో రావెల కొట్టుకుపోయారు. మేకతోటి సుచరిత చేతిలో ఘోర పరాభవం చవిచూడాల్సి వచ్చింది. ఆ ఓటమి అనంతరం జనసేన పార్టీని వీడిన రావెల.. కన్నా లక్ష్మీ నారాయణ అధ్యక్షుడుగా ఉన్న సమయంలోనే ప్రధాని మోడీ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఆయన పార్టీకి గుడ్ బై చెప్పేశారు. రాష్ట్రంలో బీజేపీ బలహీనంగా ఉండడంతో తన రాజకీయ భవిష్యత్తుపై రావెల కిషోర్ బాబు డైలమాలో పడినట్టు తెలుస్తోంది. అందుకే గత 6 నెలలుగా పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా ఉన్నారనేది సన్నిహితవర్గాల సమాచారం. మరి పార్టీని వీడితే ఆయనకి ఉన్నది రెండే ఆప్షన్స్. జనసేన పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో వైసీపీ లేదా టీడీపీ లోనే చేరాలి. ప్రత్తిపాడు నుండి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలి అనుకుంటున్న ఆయనకు వైసీపీ నుండి టికెట్ దక్కే అవకాశం కూడా లేదు. సెకండ్ టర్మ్ కేబినెట్ లో చోటు దక్కకపోవడంతో అలకబూనిన సుచరితకు ఈసారి కూడా ఎమ్మెల్యే టికెట్ నీకే అంటూ అధిష్టానం హామీ ఇచ్చి బుజ్జగించినట్టు టాక్. ఇక ఆ సైడ్ చూసే అవకాశం కూడా లేకుండా పోయింది రావెలకు. ఇక మిగిలింది సొంత గూడు టీడీపీ ఒక్కటే. 2019 ఎన్నికల్లో టీడీపీ నుండి పోటీ చేసి సుచరితపై స్వల్ప తేడాతో ఓటమి పాలైన డొక్కా మాణిక్య వరప్రసాద్ కూడా వైసీపీలో చేరారు. దీంతో అక్కడ టీడీపీకి బలమైన అభ్యర్థి కరువయ్యారు. ప్రస్తుతం మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్యకు నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయినప్పటికీ ఎన్నికల బరిలో దింపేందుకు సరైన అభ్యర్థి కోసం అన్వేషిస్తూనే ఉంది టీడీపీ అధిష్టానం. ఇదే అదునుగా భావించిన రావెల కిషోర్ బాబు పాత దోస్తులతో కలిసి పావులు కదుపుతున్నారని తెలుస్తోంది. ఈ వార్తలకి బలం చేకూరుస్తున్నట్టే ఉంది ఆయన వ్యవహారశైలి కూడా. జిల్లాకి చెందిన టీడీపీ నేతలతో కలిసి చెట్టాపట్టాలేసుకుని ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబును కూడా కలిశారు. ఇక రాజధాని రైతులు ప్రత్తిపాడు మీదుగా పాదయాత్ర నిర్వహించగా... టీడీపీ నేతలతో కలిసి యాత్ర ప్రారంభం నుండి ముగిసేవరకు వారితో కలిసి నడిచారు. అంతేకాదు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మరికొందరు జిల్లా నేతలను కలిసి తాను తిరిగి టీడీపీలో చేరే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారని విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ఆయన రాకను మాత్రం లోకల్ క్యాడర్ వ్యతిరేకిస్తోందట. రాజకీయాల్లోకి తీసుకొచ్చి, ఎమ్మెల్యే సీటు ఇచ్చి, మంత్రి పదవి ఇచ్చిన పార్టీపై కృతజ్ఞత కూడా చూపకుండా వీడటంపై గుర్రుగా ఉన్నారట. ఐదేళ్లలోనే 3 పార్టీలు మారి, ఏ దారి లేకపోవడంతోనే మళ్ళీ టీడీపీ వైపు చూస్తున్నారంటూ ఆగ్రహిస్తున్నారంట తెలుగు తమ్ముళ్లు.

# పోస్టింగ్..వెయిటింగ్

విజయవాడ, మే19,జీ స్థాయి ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుపై ఎట్టకేలకు ప్రభుత్వం సస్పెన్షన్ ఎత్తివేసింది. మంగళవారం పెద్దఎత్తున ఐపీఎస్ ఆఫీసర్లను బదిలీ చేసినప్పటికీ ఏబీవీకి పోస్టింగ్ ఇవ్వలేదు. ఇప్పటికే ఆయన తన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సీఎస్‌కు ఇచ్చి రెండు వారాలు దాటిపోయింది. అదే సమయంలో రెండు సార్లు సచివాలయానికి వెళ్లి సీఎస్‌ను నేరుగా కలిసే ప్రయత్నం చేశారు. ఓ సారి కలిసిన సీఎస్ రెండో సారి మాత్రం కలవడానికి నిరాకరించారు. ఆయన పోస్టింగ్ అంశం ప్రాసెస్‌లో పెడతామని చెప్పారు కానీ స్పందించలేదు. దీంతో ఏబీ వెంకటేశ్వరరావు సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేయడానికి సిద్ధమయ్యారని ప్రచారం ప్రారంభం కాగానే వెంటనే సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లుగా ఉత్తర్వులు ఇచ్చారు. రెండేళ్ల సస్పెన్షన్ మినహా 2022 ఫిబ్రవరి 8 నుంచి సర్వీస్ లోకి తీసుకుంటున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. తనను సస్పెన్షన్ చేసిన రోజు నుంచి సర్వీస్ లోకి తీసుకోవాలని కోర్టు కూడా అదే చెప్పిందని ఏబీ వెంకటేశ్వరరావు వాదిస్తున్నారు. అయితే ఇప్పటికైతే ఆ రెండేళ్ల సస్పెన్షన్ అలాగే ఉంది. ఇప్పుడు కూడా ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లుగా ఉత్తర్వులు ఇచ్చారు. జీఏడీలో రిపోర్ట్ చేయమని ఇచ్చారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 8 నుంచి ఏపీ ఇంటెలిజెన్స్ మజీ చీఫ్ ఎబీ వెంకటేశ్వరరావును సర్వీసులోనికి తీసుకుంటున్నట్లు ఆ ఉత్తర్వులలో పేర్కొని జీఏడీకి రిపోర్టు చేయాల్సిందిగా సూచించింది. అయితే సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు తనను 2020 ఫిబ్రవరి 8 నుంచి అంటే తనను సర్వీసులోకి తీసుకోవాలని ఏబీవీ కోరుతున్నారు. సర్వీసు నిబంధనలు ఉల్లంఘించి నిర్ణయాలు తీసుకున్నారనే ఆరోపణలతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏబీ వెంకటేశ్వరరావును 2020 ఫిబ్రవరి8న విధుల్లోంచి తొలగించిన సంగతి విదితమే. ఏపీ ప్రభుత్వ నిర్ణయంపై ఏబీవీ కోర్టులు సవాల్ చేశారు. గత నెలలో సుప్రీం కోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పు చెప్పింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోటానికి సుప్రీం కోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన సస్పెన్షన్ రద్దయ్యింది. ఏబీవీ సస్పెన్షన్ గడువు ఈ ఏడాది పిబ్రవరి 7తో ముగిసినందున ఇకపై సస్పెన్షన్ చెల్లదని తేల్చి చెప్పి విచారణ ముగించింది. . ఈ నేపథ్యంలో ఏబీవీ సస్పెన్షన్ ఎత్తి వేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిణామంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయకుండానే సస్పెన్షన్ ఎత్తివేయగలిగారు. కోర్టు ధిక్కరణ నుంచి తప్పించుకోగలిగారు. మరి పోస్టింగ్ ఇవ్వడానికి ఇంకా ఎంత కాలం తీసుకుంటారో తెలియదు కానీ.. మళ్లీ ఏదో కారణం చెప్పి సస్పెన్షన్ వేటు వేసినా ఆశ్చర్యం లేదన్న వాదన ప్రభుత్వ వర్గాల్లో వినిపిస్తోంది

# ఖాళీ బిందెలతో మహిళలు

అనంతపురం, మే 19, ఎమ్మెల్యే డౌన్ డౌన్', 'సర్పంచ్ డౌన్ డౌన్' అని నినదిస్తూ రాప్తాడు నియోజకవర్గం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ కార్యాలయాన్ని ఖాళీ బిందెలతో మహిళలు చుట్టుముట్టారు. తాగు నీళ్ళు ఇవ్వాలంటూ మహిళల నుంచి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి నిరసన సెగలు తగిలాయి. 2019లో తమకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిపై మహిళలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. గెలిచిన నెలలోగా నీళ్ళు అందిస్తామని చెప్పి మూడేళ్లు అవుతున్నా ఇంతవరకూ పట్టనట్లు వ్యవహరించడమేంటని వారు ఫైరయ్యారు. మాట తప్పిన ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రోడ్లు, డ్రైనేజీ అంటూ మాయమాటలు చెప్పిన ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డీ అవన్నీ ఎక్కడయ్యా అంటూ కక్కలపల్లి గ్రామస్తులు నిలదీశారు. దమ్ముంటే బయటకు రావాలంటూ ఎమ్మెల్యే తోపుదుర్తికి, సర్పంచ్ కి మహిళలు సవాల్ విసిరారు. ఇళ్లు అమ్ముకున్నాం, స్థలాలు అమ్ముకున్నాం అని చెప్పి మాయచేసి సింపతీ ఓట్లు దండుకున్న తోపుదుర్తి తీరా తమ ఓట్లతో గెలిచిన తర్వాత సమస్యలు పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. తోపుదుర్తి అమ్ముకున్న ఇళ్లు, స్థలాలకు వాస్తు దోషాలే తప్ప మరో కారణం ఏమీ లేదని మహిళలు ఎద్దేవా చేశారు. అరకొరగా తమకు వచ్చే కూలి డబ్బులతో పూట గడపాలా..? నీళ్లే కొనుక్కోవాలా అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు

# ఆశ్చర్యపరిచిన జగన్ నిర్ణయం

విజయవాడ, మే 19, ఏపీలో వైసీపీ రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక పట్ల రాజకీయ వర్గాలలో విస్మయం వ్యక్తమౌతున్నది. రాష్ట్ర ప్రయోజనాలు, సామాజిక సమీకరణాలతో సంబంధం లేకుండా కేవలం అధినేత ఇష్టాయిష్టాలు, వ్యక్తిగత ప్రయోజనాలే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక జరిగినట్లు అనిపిస్తున్నదని వారు విశ్లేషిస్తున్నారు. ఉన్న నాలుగు స్థానాలలో ఇద్దరు వేరే పార్టీ నుంచి జంప్ జిలానీ పద్ధతిలో వచ్చిన వారైతే మిగిలిన ఇద్దరూ తనతో పాటు ఆర్థిక నేరాలలో సహ నిందితులు కావడాన్ని ఎత్తి చూపుతున్నారు. వైసీపీ ప్రకటించిన నలుగురు అభ్యర్థులలో ఇద్దరు బీసీలు కాగా మిగిలిన ఇద్దరూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు. అలాగే ప్రకటించిన ఇద్దరు బీసీ అభ్యర్థులూ కూడా తెలుగుదేశం పార్టీ నుంచి వలస వచ్చిన వారే. వారిద్దరిలో ఒకరు తెలంగాణకు చెందిన వారు. తెలంగాణకు చెందిన ఆర్ కృష్ణయ్యను జగన్ రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించడం వెనుక కూడా క్విడ్ ప్రోకో ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణ నుంచి రాజ్యసభకు కేసీఆర్ ఒక ఫార్మా కంపెనీ అధినేతను రాజ్యసభకు పంపనున్నారనీ, ఆ ఫార్మా కంపెనీ అధినేత వైసీపీ నాయకుడు విజయసాయి రెడ్డి వియ్యంకుడు కావడంతో అందుకు ప్రతిగా తెలంగాణ సీఎం సిఫారసు చేసిన ఆర్. కృష్ణయ్యను ఏపీ నుంచి రాజ్యసభకు పంపేందుకు జగన్ నిర్ణయించారని చెబుతున్నారుఇక బీసీ కోటాలో రాజ్యసభకు జగన్ ఎంపిక చేసిన మరో వ్యక్తి బీద మస్తాన్ రావు. ఆయన తెలుగుదేశం నుంచి వైసీపీలోకి వచ్చిన వలస పక్షి. బీద మస్తాన్ రావుది నెల్లూరు జిల్లా కావలి. ఈయన కావలి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరపున నెల్లూరు లోక్ సభ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. టీడీపీలో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదనే అసంతృప్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. ఆయనకు జగన్ రాజ్యసభ టికెట్ ఇచ్చారు. ఇక మిగిలిన రెండు స్థానాలలో ఒకటి సిట్టింగ్ ఎంపీ విజయసాయిరెడ్డికే ఇచ్చారు. ఆయన జగన్ అక్రమాస్తుల కేసులో ఏ-2 అన్న సంగతి తెలిసిందే. ఇక నాలుగో స్థానం జగన్ అక్రమాస్తుల కేసులు వాదిస్తున్న న్యాయవాది నిరంజన్ రెడ్డికి ఇచ్చారు. ఇలా వైసీపీ నాలుగు రాజ్యసభ స్థానాలూ కూడా జగన్ వ్యక్తిగత ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఎంపికేనని రాజకీయ వర్గాలలో చర్చ నడుస్తోంది. క్విడ్ ప్రోకొ కింద తెలంగాణకు చెందిన ఆర్.లక్ష్మయ్యను ఏపీ నుంచి రాజ్యసభకు ఎంపిక చేసి కూడా బీసీ ఉద్ధరణ కోసమే అని చెప్పుకోవడం జగన్ కే చెల్లిందన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి.

# కిరణ్ రెడ్డి ఎంట్రీ... జగన్ రెడ్డికి తిప్పలు





తిరుపతి, మే 19, మ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయాల్లోకి రీఎంట్రీ ఇస్తున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు మేరకు ఆయన ఢిల్లీ వెళ్లారు. అక్కడ కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో సమావేశం కానున్నారు. కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్న రాష్ట్రాలపై తాజాగా ఆ పార్టీ అధిష్ఠానం దృష్టి పెట్టింది. ఈ రాష్ట్రాల్లో బలమైన నాయకులకు పార్టీ పగ్గాలు అందించడం ద్వారా మళ్లీ పూర్వవైభవం తెచ్చుకోవాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఒకనాడు తమ పార్టీ వెలుగు వెలిగి కనుమరుగైన ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ బలోపేతం కావాలని చూస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితులు తమకు కొంతవరకైనా కలిసి వస్తాయని ఆ పార్టీ భావిస్తోంది. ఇందులో భాగంగానే కిరణ్ కుమార్ రెడ్డిని ఢిల్లీ పిలిపించారు. ప్రస్తుత పీసీసీ చీఫ్ శైలజానాథ్ పదవీకాలం ముగిసింది. రాష్ట్రంలో కొత్త పీసీసీ చీఫ్‌ను నియమించాల్సి ఉంది. ఈ పదవిని కిరణ్ కుమార్ రెడ్డికి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముందు యువకుడి పాడు పని ముఖ్యమంత్రిగా పని చేసిన కిరణ్ కుమార్ రెడ్డికి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఇది కలిసి వస్తుందని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన చేసిందనే ఆగ్రహం ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో ఇంకా ఉంది. అయితే, 2014తో పోల్చితే ఇప్పుడు కొంత తగ్గిందనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. ప్రస్తుత బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదని, ఇతర విభజన హామీలు అమలు చేయలేదనే అసంతృప్తి కూడా రాష్ట్ర ప్రజల్లో ఎక్కువగా ఉంది. ఇది కాంగ్రెస్ పార్టీపైన ఉన్న ఆగ్రహం తగ్గడానికి కారణమవుతుంది. అన్నింటికంటే కాంగ్రెస్‌కు పెద్ద మైనస్ బలమైన నాయకులు లేకపోవడం. రాష్ట్ర విభజన తర్వాత ఆ పార్టీలోని కీలక నేతలందరూ టీడీపీ, వైసీపీలో చేరిపోయారు. కొందరు మాత్రమే కాంగ్రెస్‌లో మిగిలి ఉన్నారు. వారు కూడా సైలెంట్ అయిపోయారు. యాక్టీవ్‌గా రాజకీయాలు చేయడం లేదు. అయితే, కాంగ్రెస్ నుంచి వైసీపీలోకి మెజారిటీ రెడ్డి నేతలు వెళ్లారు. వీరిలో చాలా మంది ఇప్పుడు వైసీపీలో ఉక్కపోతతో ఉన్నారు. తమకు ప్రాధాన్యత లేదనే అసంతృప్తి వీరిలో చాలా బలంగా ఉంది. వైసీపీలో రెడ్లకు ఎక్కువగా ప్రాధాన్యత దక్కడం లేదు. ఐదారు సార్లు ఎమ్మెల్యేలుగా గెలిచిన నేతలు కూడా ఒకటి రెండు సార్లు గెలిచి మంత్రి అయిన వారి కింద పని చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇది ఆ నేతలను ఇబ్బంది పెడుతోంది. ఒకవేళ కనుక కిరణ్ కుమార్ రెడ్డి పీసీసీ చీఫ్ అయి మళ్లీ యాక్టీవ్ అయితే ఇలాంటి వారు ఆయన వెంట నడుస్తారనే ఆశలు కాంగ్రెస్‌కు ఉన్నట్లు కనిపిస్తోంది. గ్రామస్థాయిలో కూడా రెడ్డి సామాజకవర్గంలో క్రమంగా వైసీపీ పట్ల అసంతృప్తి పెరుగుతోంది. వైసీపీని తమ పార్టీగా భావించి, ఆ పార్టీ గెలుపు కోసం తొమ్మిదేళ్ల పాటు తీవ్రంగా కష్టపడ్డ వారు, ఆస్తులు సైతం పొగొట్టుకున్న రెడ్డి సామాజకవర్గం వారు చాలా మందే ఉన్నారు. ఇలాంటి వారికి ఇప్పుడు అధికారంలోకి వచ్చినా కూడా ఎలాంటి అవకాశాలు రావడం లేదనే అసంతృప్తి ఉంది. వీరు కూడా కిరణ్ కుమార్ రెడ్డి వెంట నడిచే అవకాశాలు ఉండొచ్చనే ఆశలు కాంగ్రెస్‌లో ఉన్నట్లున్నాయి. అయితే, కిరణ్ కుమార్ రెడ్డి నిజంగానే పీసీసీ చీఫ్ బాధ్యతలు తీసుకొని కాంగ్రెస్‌ను ఏపీలో బలోపేతం చేస్తే అది కచ్చితంగా వైసీపీకే నష్టం చేసే అవకాశాలు మాత్రం స్పష్టంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే.. ఇక్కడ కాంగ్రెస్ పార్టీనే వైసీపీగా మారిందని చెప్పుకోవాలి. కాంగ్రెస్ ఓటు బ్యాంకే వైసీపీ ఓటు బ్యాంకు అయ్యింది. ఇప్పుడు కాంగ్రెస్ ఒక్క ఓటు అదనంగా తెచ్చుకున్నా అది వైసీపీకి పడే ఓటు తగ్గడమే అవుతుంది. వచ్చే ఎన్నికల్లో ఒకవైపు పొత్తులతో టీడీపీ, జనసేన కలిసి రానున్న నేపథ్యంలో కిరణ్ కుమార్ రెడ్డి కనుక వైసీపీ ఓట్లను ఏ మాత్రం చీల్చినా అది వైసీపీకి నష్టం చేసే అవకాశాలు మాత్రం కనిపిస్తున్నాయి.

## గుడివాడలో చిరుజల్లులు

గుడివాడ గత వారం రోజులుగా విపరీతమైన ఎండలు తో అల్లాడిపోతున్న గుడివాడ ప్రజానీకం కు ఒక ఉపశమనము గా గురువారం ఉదయం నుండి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. గంట నుండి విపరీతమైన నల్లటి మబ్బులతో వాతావరణం చల్లదనం గా మారడంతో గుడివాడ ప్రజలు సేద తీరుతున్నారు. చిరుజల్లులు తో కూడిన వర్షం ఉదయం నుండి పడుతున్నది.

## జలపాతంలో ఇద్దరు మృతి





అనంతగిరి అల్లూరిసీతారామరాజు జిల్లాలో జలపాతాలు పర్యా టకులకు ఒకవైపు ఆహ్లాదాన్ని, ఆనందాన్నిస్తుంటే అక్కడికి వెళ్ళినవారు మరణించడంతో విషాదం నెలకొంటోంది. సరియా జలపాతం టూరిస్టుల పాలిట మృత్యుకుహరంగా మారింది. అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ పరిధిలోని సరియా జలపాతం ప్రమాదభరితంగా మారింది. సరియా జలపాతానికి విహారానికి వచ్చిన విశాఖకు చెందిన ఇద్దరు యువ కులు గల్లంతయ్యారు. వారి మృతదేహాలను అనంతగిరి పోలీసులు ఎట్టకేలకు గుర్తించి ఒడ్డుకు చేర్చారు. విశాఖ జగదాంబ సమీపంలోని ఎల్లమ్మతోట ప్రాంతానికి చెందిన నలుగురు స్నేహితులు సరియా జలపాతం సందర్శించేందుకు వచ్చారు. వారిలోదుక్కసాయి 39 ప్రమాదవశాత్తూ జలపాతంలో జారిపడగా తనను రక్షించే ప్రయత్నంలో చైతన్య అనే 17 ఏళ్ళ యువకుడు కూడా అందరి కళ్లముందే గల్లంతయ్యాడు. దీంతో ఆందోళనకు గురైన మిగిలిన ఇద్దరు స్నేహితులు సమీపంలోని దేవరాపల్లి పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఫిర్యాదు చేయగా అనంతగిరి పోలీసులు గజ ఈతగాళ్లతో మృతదేహాలను గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సరియా జలపాతంపై పోలీసులు స్థానికులు పలు హెచ్చరికలు సూచనలు చేస్తున్నప్పటికీ తరచూ పర్యాటకులు జలపాతంలో మృత్యువాతకు గురవుతున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినప్పటికీ పర్యాటకులు వాటిని పట్టించు కోకపోవడంతో ప్రమాదాలకు గురై వారి కుటుంబాలను శోకసంద్రంలో ముంచుతున్నారు. ఇప్పటికైనా అధికారు లు భద్రతా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మడకశిరలో దంచికొట్టిన భారీ వర్షం

**పొంగి పొర్లుతున్న పలు చెరువులు**

మడకశిర శ్రీ సత్య సాయి జిల్లా మడకశిరలో భారీ వర్షపాతం నమోదైంది. గత రాత్రి కురిసిన వర్షానికి మడకశిర నుంచి పెనుగొండకు వెళ్లే ప్రధాన రహదారి లో వంకలు పారడంతో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. అలాగే మండల పరిధిలోని రేకులకుంట గ్రామంలో వడిసి లమ్మ గుడి దగ్గర తారు రోడ్డు కోతకు గురై నాలుగైదు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మడకశిర మండల పరిధిలోని ఎర్ర బొమ్మనహళ్లి, చత్రం, గౌడనహళ్ళి, ఉప్పీడిపల్లి, మణురు చెరువులు గత రాత్రి కురిసిన భారీ వర్షానికి పూర్తిస్థాయిలో నిండి మరువ పారడం తో స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క మడకశిర పట్టణంలో లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమై పట్టణంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. మడకశిర మండలంలో 94 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది అలాగే అమరాపురం మండలం లో 50 మిల్లీ మీటర్లు ,అగలి మండలం లో 46 మిల్లీమీటర్లు, రోళ్ల మండలం లో 61 మిల్లీ మీటర్లు, గుడిబండ మండలం లో 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలియజేశారు. ఏది ఏమైనా తొలకరి లోనే అధిక వర్షాలు పడడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం చేశారు.

## కృష్ణయ్యకు ఆఫర్... ఫ్యాన్ లో అలజడి

హైద్రాబాద్, మే 19, (న్యూస్ పల్స్)రాజ్యసభ పదవుల పందేరం పుణ్యమా అని ఆంధ్రప్రదేశ్ లో ఇప్పుడు తెలంగాణ చిచ్చు రాజుకుంది. పెద్దల సభకు పంపించి, గౌరవించాలనేదీ సీఎం జగన్ నిర్ణయం అయితే.. ఏపీలో అర్హత ఉన్న బీసీ నేతలెవరూ లేరా? అనే ప్రశ్న పలువురి నుంచి వస్తోంది. అంటే.. ఏపీలో ఉన్న బీసీ నేతలెవరూ జగన్ దృష్టిలో పనికిరానివారా అంటూ నిలదీస్తున్నారు. ఏపీలోని బీసీలను కించపరిచే విధంగా తెలంగాణ నుంచి ఆర్. కృష్ణయ్యను రాజ్యసభకు ఏపీ నుంచి ఎంపిక చేయడంపై పలువురు బీసీ నేతలు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి త్వరలో ఏర్పడనున్న నాలుగు రాజ్యసభ స్థానాల ఖాళీలను భర్తీ చేసేందుకు సీఎం జగన్మోహన్ రెడ్డి అభ్యర్థులను ప్రకటించారు. వాటిలో ఇప్పటికే రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న విజయసాయిరెడ్డికి కొనసాగింపునిచ్చారు. తన వ్యక్తిగత కేసులను కోర్టుల్లో వాదించే నిరంజన్ రెడ్డికి అవకాశం ఇచ్చారు. మిగిలిన రెండు స్థానాల్లోనూ బీసీలైన బీద మస్తాన్ రావు, ఆర్. కృష్ణయ్యను ఎంపిక చేశారు. ఖాళీ అవుతున్న నాలుగు స్థానాల్లో సగం బీసీలకే కేటాయించడం గమనార్హం. బీసీ ఓటు బ్యాంకును చీల్చేందుకు జగన్ రెడ్డి రాజకీయంగా ఎత్తుగడ వేసినప్పటికీ ఏపీలో సరైన బీసీ నేతలే లేరన్నట్లు జగన్ తెలంగాణ వ్యక్తి ఆర్.కృష్ణయ్యను ఏపీ నెత్తిన ఎక్కించడం ఏంటనే విమర్శలు వస్తున్నాయి. పెద్దల సభకు వెళ్లే అర్హతన ఏపీలోని 140కి పైగా ఉన్న బీసీ కులాల్లోని ఏ ఒక్క నేతకీ అర్హత లేదా? జగన్ రెడ్డీ అంటూ టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు నేరుగా ప్రశ్నించారు. లేదా ఏపీలో నివసిస్తున్న బీసీలు బీసీలే కాదనేది జగన్ రెడ్డి ఉద్దేశమా? అని నిలదీశారు. నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ పోరాడి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ నుంచి నేతను తెచ్చిన నెత్తికి ఎక్కించుకోవడం ఏంటని తూర్పాపట్టారు. నిధులు, విధులతో పసాటు అసలు కూర్చునేందుకు కుర్చీ కూడా లేని ఉత్తుత్తి 56 కార్పొరేషన్లను ఏపీ బీసీలకు విదిల్చి, తెలంగాణ వారికి అత్యున్నత రాజ్యసభ స్థానాలు కట్టబెట్టడం అంటే.. ఏపీలో బీసీ నేతలకు వెన్నుపోటు పొడవడమే అంటూ చింతకాయల అయ్యన్న పాత్రుడు చింతనిప్పులు చెరిగారు. తెలంటగాణకు చెందిన వ్యక్తులకు ఏపీ కోటాలోని రాజ్యసభ స్థానాలు ఎలా కేటాయిస్తారంటూ టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సీఎం మొదటి రోజు నుంచే జగన్ రెడ్డి ఏపీ నీళ్లు, నిధులు, నియామకాలను తెలంగాణకి దోచిపెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ నుంచి రాజ్యసభకు పంపిస్తున్న ఇద్దరు బీసీలు బీద మస్తాన్ రావు, ఆర్.కృష్ణయ్యకు రాజకీయ జీవితం ఇచ్చిందే టీడీపీ అనే విషయం గుర్తుచేశారు టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు. వైసీపీతో బీసీలు లేరు కాబట్టే టీడీపీ నుంచి వచ్చిన వారికి రాజ్యసభ సీట్లు కట్టబెట్టారని ఎద్దేవా చేశారు. బీసీలకు పెద్దపీట వేశామని కలరింగ్ ఇస్తున్న జగన్ రెడ్డి అసలు బీసీ రిజర్వేషన్లపై ఏనాడైనా కేంద్రాన్ని ప్రశ్నించారా? అని నిలదీశారు. సీఎం సీటు నుంచి జగన్ తప్పుకుని బీసీలకు ఇచ్చే దమ్ముందా? అని యనమల సవాల్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు టీడీపీ కల్పించిన రిజర్వేషన్లను 10 శాతానికి తగ్గించింది వైసీపీ కాదా? అని యనమల ప్రశ్నించారు .వాస్తవానికి పార్టీ ఆవిర్భావం నుంచీ బీసీలు టీడీపీకి పెట్టని కోటలా ఉన్నారు. అయితే.. తాజాగా ఖాళీ ఏర్పడుతున్న నాలుగు రాజ్యసభ స్థానాల్లో సగం సీట్లు బీసీలకే ఇచ్చామని చెప్పుకోవడం ద్వారా ఆ వర్గాల ఓట్లు కొల్లగొట్టాలనేది జగన్ వ్యూహంగా ఉందనేది సుస్పష్టం. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి బీసీ ఓటర్లను దూరం చేయాలనే రాజకీయ కుట్ర ఉందనేది టీడీపీ నేతల నుంచి వస్తున్న వ్యాఖ్య. మొత్తం మీద ఏపీ కోటాలో తెలంగాణ వ్యక్తిని రాజ్యసభకు ఎంపిక చేసిన జగన్ రెడ్డి తీరుపై ఏపీ వ్యాప్తంగా బీసీల్లో మరింత ఆగ్రహం పెల్లుబికే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## పల్లె దవాఖానాలలో ఆర్ ఎం పి గ్రామీణ వైద్యులను నియమించాలి

చొప్పదండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజల ఆరోగ్యం కొరకు చేపట్టిన పల్లె దవాఖానాలు బస్తీ దవాఖాన లో ఆర్ఎంపీ,పిఎంపీ, ప్రథమ చికిత్స అనుభవ గ్రామీణ వైద్యులను నియమించి జీవన ఉపాధి కల్పించాలని సీనియర్ ప్రథమ చికిత్స వైద్యులు కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఆర్ ఆర్ పి, పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి మందు వేణుగోపాల్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ, పి ఎం పి, ప్రథమ చికిత్స, గ్రామీణ వైద్యుల ఆలోచన విధానాలను ముందు వేణుగోపాల్ గౌడ్ తెలియజేస్తూ మీడియాకు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు కాకముందు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధన ఉద్యమం కొరకు పట్టణ గ్రామీణ ప్రాంతాలలో నిర్విరామంగా పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఆర్ఎంపీలకు ఎలాంటి ప్రయోజనం జరగలేదని ఆవేదన వ్యక్తం చేసారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వస్తే గ్రామీణ వైద్యుల బ్రతుకులు మారుతాయని వైద్య ఆరోగ్య శాఖలో అనుభవంతో కూడిన అర్హులకు ఉద్యోగాలు వస్తాయని అంతేకాకుండా పల్లె ప్రాంతాలలో వారికి ప్రత్యేక పారితోషకం ఇచ్చి పేద ప్రజలకు వైద్యం చేసే ఈ అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న గ్రామీణ వైద్యులకు చివరికి నిరాశ మిగిలిందని అన్నారు. ఉద్యోగాల కొరకు ప్రభుత్వాలపై ఆధారపడకుండా క్వాలిఫైడ్ వైద్యుల వద్ద ప్రత్యేక శిక్షణ పొంది అనుభవంతో గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక సాధారణ వ్యాధులకు ఆర్.ఎం.పి, పిఎంపీ, ప్రథమ చికిత్స గ్రామీణ వైద్యులు పేద ప్రజలకు వైద్యం అందిస్తున్నారని అన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాలలో పేద నిరుపేద వర్గాల కుటుంబాలకు సాధారణ ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ వారి కుటుంబాలలో కుటుంబ సభ్యులుగా మనసులోన ఉండిపోయి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న గ్రామీణ వైద్యులను పట్టించుకున్న ప్రభుత్వాలు లేకపోవడం చాలా బాధాకరమైన విషయం ప్రభుత్వాలు మారినా గ్రామీణ వైద్యుల బ్రతుకులు మారకపోవడం ఆధునిక కాలంలో ఇంకా వెనుకబడి ఉండడం చూస్తుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనబడుతుంది వాస్తవాలకు వెళితే గ్రామీణ ప్రాంతాలు వెనుకబడిన ప్రాంతాలు పల్లెలు పట్టణాలలో కూడా పేద ప్రజలు కూలీలు ప్రతి ఒక్కరికి తక్కువ ఖర్చుతో ప్రాథమిక వైద్యం చేసేది కేవలం గ్రామీణ వైద్యులేనని ఉన్నారు. ఈరోజు రాష్ట్రాన్ని పరిపాలించే నాయకులు అధికారులు కూడా ఆర్ఎంపీ, పిఎంపీ, ప్రథమ చికిత్స గ్రామీణ వైద్యుల వద్ద వైద్య చికిత్స తీసుకున్న వారేననే ఈ విషయాన్ని మరిచిపోకూడదని అన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా రాజకీయ నాయకులకు మద్దతుగా నిలిచి వారి గెలుపు కొరకు కృషి చేశామని తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు మరిచిపోయారని అన్నారు. గుర్తింపు కొరకు నాతోటి ఆర్ఎంపీ, పి ఎం పి, గ్రామీణ వైద్యులు, ప్రథమ చికిత్స వైద్యుల వివిధ రకాల రాష్ట్ర జిల్లా సంఘాల ఆధ్వర్యంలో వివిధ రూపాలలో పోరాటాలు చేస్తూ ప్రజాప్రతినిధులకు ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పిస్తూ నేరుగా కలిసి విన్నవించుకుంటున్నప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి ఆర్.ఎం.పి వైద్యుల గుర్తింపు కొరకు రాష్ట్ర జిల్లా సంఘాల అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఏం చేస్తున్న పోరాటాలు అభినందనీయమని తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్ ఎం పి,పి ఎం పి, గ్రామీణ వైద్యుల, ప్రథమ చికిత్స వైద్యుల పట్ల చిన్న చూపు వదిలి ప్రత్యేక గుర్తింపు తీసుకొనివచ్చి బస్తీ దవాఖాన పల్లె దవాఖానాలలో ప్రాధాన్యత కల్పించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు కోరుతున్నట్లు తెలియజేశారు ఈ విషయంపై రాష్ట్రంలోని యొక్క ప్రజాప్రతినిధులు సంబంధిత నియోజకవర్గాలు ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై పై ఒత్తిడి తీసుకొని రావాలని కోరారు.

## వివాహ జీవితం పై అవగాహన సదస్సు

కడప పెళ్లయిన కొద్ది రోజులలోనే భార్య, భర్తల మధ్య, సఖ్యత లేక, విడిపోతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, ఒకరిపై ఒకరికి అవగాహన లేకపోవడం. ఒకరిని ఒకరు అర్థం చేసుకోకపోవడం వివాహ కుటుంబ బంధాలు, బాధ్యతలు తెలుసుకోక పోవడమే ప్రధాన కారణమని, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ అబ్రహం అన్నారు. ఆరోగ్యమాత చర్చి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మరణం వారిని వేరు చేసేంతవరకు కలిసి ఉండాల్సిన భార్య భర్తలు, కాళ్లకు పారాణి కూడా ఆరకముందే! వారి వివాహ జీవితం ఆరిపోతున్నాయని ఆయన చింతించారు. ఆదిలోనే ఆవిరి కావడం అవగాహన లోపమే నని, యువతీ యువకులకు వివాహ జీవితం పై పూర్తి అవగాహన కల్పిస్తూ, భార్య భర్తల జీవితం ఎంతో విలువైనదని తెలియచెప్పడంతో వారి జీవితానికి ఎంతో ఉపయోగకరం అని ఆయన వివరించారు. కడప మెత్రసనం అపోస్తూలిక పాలన అధికారి బిషప్ గాలి బలి. తండ్రి గారి ఆదేశాల మేరకు, కడప నగర పరిధిలోని మూడు విచారణల లోని 18 సంవత్సరములు నిండిన యువతీ యువకులకు,21,22,శని,ఆదివారలలో ఆరోగ్యమాత పుణ్యక్షేత్ర ప్రాంగణంలో వివాహ జీవితం పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సదస్సులో పాల్గొని, వివాహ జీవితం గురించి విలువైన విషయాలను సూచనలు, సలహాలు తెలుసుకుని ఆదర్శవంతమైన భార్యాభర్తలుగా జీవితం గడుపుటకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

## ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలకు ప్లాన్

విజయవాడ, మే 19, (న్యూస్ పల్స్)దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను టిడిపి మహానాడుగా నిర్వహిస్తోన్న విషయం తెలిసిందే. ప్రతి ఏడాది మాదిరి.. ఈ ఏడాది కూడా టిడిపి మహానాడు నిర్వహణకు సిద్ధమవుతోంది. ఈసారి శతజయంతి వేడుకల సందర్భంగా నూతన భావజాలాన్ని చాటేలా.. ఒంగోలు సమీపంలోని మండువారిపాలెం గ్రామ పరిధిలో మహానాడు నిర్వహించాలని చంద్రబాబునాయుడు భావిస్తున్నారు. ఈ మేరకు నిర్వహణ కమిటీలతో చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. తొలుత ఒంగోలు మినీ స్టేడియం వద్ద మహానాడు నిర్వహించాలనుకున్నా.. అందుకు ప్రభుత్వం నిరాకరించడంతో వేదికను మార్చినట్లు చంద్రబాబు తెలిపారు. మొదట పరిశీలించిన మండువారి పాలెంలోనే మహానాడు నిర్వహిస్తామని టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు తెలిపారు మండువారిపాలెం రెవెన్యూ విలేజ్ పరిధిలో గల త్రోవగుంట ప్రాంతంలో మే 27,28 తేదీల్లో టిడిపి మహానాడు జరగనున్నట్లు చంద్రబాబు తెలిపారు. మహానాడు నిర్వహణ సమయానికి వర్షాలు వచ్చే అవకాశాలున్న నేపథ్యంలో ఒంగోలు మినీ స్టేడియం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేయగా.. చివరి నిమిషంలో నిరాకరించడం పై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో..తొలుత పరిశీలించిన బృందావన్ ఫంక్షన్ హాల్ ప్రాంతంలోనే మహానాడు నిర్వహించాలని నిర్ణయించారు. నూతనత్వంతో, భావజాలం చాటేలా మహానాడు నిర్వహించాలని చంద్రబాబు నేతలకు సూచించారు. స్టేడియం కోసం దరఖాస్తు చేసి, అవసరమైన ఫీజు చెల్లించినా ప్రభుత్వం ఒంగోలు మినీ స్టేడియం ఇవ్వకపోవడంపై టిడిపి నేతలు మండిపడ్డారు. మే 17 నుంచి సభా ప్రాంగణంలో మహానాడు పనులు మొదలయ్యాయి

## ఘనంగా నీలం సంజీవరెడ్డి జయంతి వేడుకలు



అనంతపురం మాజీ రాష్ట్రపతి స్వర్గీయ నీలం సంజీవరెడ్డి 109వజయంతి వేడుకలు అనంతపురం జిల్లాలో ఘనంగా జరిగాయి . జయంతి వేడుకలు అనంతపురం నగరంలో శ్రీకంఠం సర్కిల్ సంజీవ రెడ్డి విగ్రహం వద్ద ఏ డి సి సి బ్యాంక్ మాజీ చైర్మన్ తరిమెల కోన రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తరిమెల కోనా రెడ్డి సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవరెడ్డి రాష్ట్రపతి దాకా ఎన్నో కీలక పదవులు నిర్వహించిన ఆయన నీతి నిజాయితీకి పారదర్శకతకు కట్టుబడిన వ్యక్తి అని కొనియాడారు వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన రాజకీయంగా రాష్ట్రపతి పదవి దాకా ఎదిగారని ఇది ఆయన రాజకీయ చతురతకు నిదర్శనం అన్నారు. కరువుతో సతమతమవుతున్న రాయలసీమ జిల్లాలకు సాగు తాగునీరు అందించాలన్న ముందుచూపుతో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు ఈ కార్యక్రమంలో ఏ పీ ఎస్ ఐ డి సి మాజీ చైర్మన్ నల్లపురెడ్డి అయోధ్య హోటల్ యాజమాన్యం పెద్దిరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## జక్కంపూడి కాలనీలో బాదుడే బాదుడు కార్యక్రమం

విజయవాడ విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి కాలనీలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు బాదుడేబాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసారు. జగన్ సర్కారు హయాంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, పెంచిన పన్నులను, కరెంటు ఛార్జీలను ప్రజలకు వివరించారు. దేవినేని మాట్లాడుతూ జగన్ పాలనపై జనాలు రెఫరెండం ఇస్తున్నారు...వైసిపి ప్రజాప్రతినిధులను ప్రజలు అడ్డగిస్తూ నిరసన తెలియజేస్తున్నారు. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత పెరిగిన ధరలతో సామాన్యుడి బతుకు అగమ్యగోచరమైంది. జగన్ పాలనలో రాష్ట్రం నాశనం అయ్యింది... జగన్ ను నమ్మి జనాలు మోసపోయారు. నిత్యావసర వస్తువుల ధరల అసాధారణ పెరుగుదల, కరెంట్ చార్జీల పెంపు, ఆర్టీసీ బస్ చార్జీల పెంపు, చెత్త పై సుంకం ,వంట గ్యాస్ మరియు పెట్రోల్, డీజల్ ధరల పెరుగుదల పై ఆగ్రహం వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి డబ్బు కక్కుర్తికి పోలవరం ప్రాజెక్టు బలైంది.. ఇంత పెద్ద ప్రాజెక్టును సమాధి చేసింది. జక్కంపూడి కాలనీలో పారిశుధ్యం అస్తవ్యస్తం. .. కనీస మౌలిక వసతులు మంచినీరు రోడ్లు కూడా లేని పరిస్థితి వుంది. నిత్యావసరాల ధరలు పెంచి వైసీపీ ప్రభుత్వం ప్రజలపై భారం మోపిందని అన్నారు.

## రైలు పెట్టెలో శవం లభ్యం

తిరుపతి రైలు పెట్టెలో శవం లభ్యం అయింది. తిరుపతి నాలుగవ నెంబర్ ప్లాట్ ఫామ్ కు చేరిన చామరాజనగర్–తిరుపతి రైలులోని డి వన్ కోచ్ లో మృతదేహం గుర్తించారు. ప్యాసింజర్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేక లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 60–70 మధ్య ఉంటుందని గ్రీన్ అండర్ వేర్ డ్రాయర్ ,ఎర్ర మట్టి కలర్ ప్యాంటు, ఎరుపు, నలుపు, తెలుపు గళ్ళ ఫుల్ షర్టు ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఎవరైనా గుర్తిస్తే తిరుపతి రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.



# జగనన్న స్వచ్ఛ సంకల్పంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి



**గ్రామస్థులు అంతా చేయి చేయి కలిసి పసుపుల గ్రామాన్ని జిల్లాలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి**
**:- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు**

కర్నూలు మే,19 :- జగనన్న స్వచ్ఛ సంకల్పంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, గ్రామస్తులు అంతా చేయి చేయి కలిసి పసుపుల గ్రామాన్ని జిల్లాలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా కర్నూలు మండలం పసుపుల గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చరిత్ర తెలిసిన నాటి నుంచి మార్పుకు దోహదపడేది మహిళలే అని, పరిశుభ్రత లో కూడా కీలక పాత్ర పోషించాలన్నారు ... గ్రామం పరిశుభ్రంగా ఉంచుకొనుట కోసం తడి, పొడి చెత్తను వేరు చేసి క్లాప్ మిత్రాలకు ఇవ్వాలన్నారు. గ్రామ పంచాయతీకి ఇచ్చిన తడి చెత్త ద్వారా వర్మీ కంపోస్టును తయారు చేసి రైతులకు అందచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు . ప్రతి మంగళ, గురు, శనివారాల్లో పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు, గ్రామంలో తిరుగుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ప్రతి ఒక్క ఇంటిలో రెండు డబ్బాలు వుంచుకొని ఒక దానిలో తడి చెత్త మరొక దానికి పొడి చెత్త వేసి వచ్చిన క్లాప్ మిత్రాలకు ఇవ్వాలన్నారు. మనం చేసే పనిని ఆనందంగా, ఆహ్లాదకరంగా చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. గ్రామాల్లో ఎక్కడ కూడా ప్లాస్టిక్, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదన్నారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ ను వాడకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తడి చెత్త నుంచి వచ్చిన వర్మీ కంపోస్టు ద్వారా భూసారం పెరిగి మంచి పంటలు పండుతాయన్నారు. భవిష్యత్ తరాల కోసం కృత్రిమ ఎరువులకు బదులుగా వర్మి కంపోస్టును వాడటం వలన రైతులకు ఆరోగ్య వంతమైన పంటను దిగుబడి చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రయోజనాలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. పాడి పశువుల నుంచి వచ్చిన వ్యర్థాలను గాలికి వదిలేయడం వలన రోగాలు వస్తాయని వాటిని మట్టితో కప్పి ఉంచడం ద్వారా మంచి ఎరువును తయారు చేసుకోవచ్చన్నారు. ఆ వ్యర్థాల ద్వారా వచ్చే ప్రమాదకర వాయువులు వలన గ్రామంలోని ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తాయని, అందువలన గ్రామాలలో ప్రజలు అందరూ సమిష్టిగా కృషిచేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని వాటి గ్రామస్తులకు వివరించారు. చెత్తను నుండి సంపద తయారీ చేసుకోవడం పై ప్రక్రియను చేసే విధానం గూర్చి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం వహించి చెత్త సేకరణలో ముందుండి నడిపించాలని వారు ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ గ్రామస్తులను ఉద్దేశించి అన్నారుఅనంతరం స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామస్తులు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి, చెత్త నుండి వర్మీ కంపోస్ట్ ను తయారవుతున్న ప్రక్రియను పరిశీలించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇంక్రినేరేటర్ పరికరం ద్వారా వ్యర్థాలను బూడిద చేసే ప్రకియను అడిగి తెలుసుకున్నారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సరైన మాస్కులు, గ్లౌజులు అందించాలన్నారు.

# సోషలిజమే లక్ష్యంగా సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలు చేద్దాం



**:- సిపిఎం పార్టీ ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి పిలుపు**

కర్నూలు మే 19 :- సుందరయ్య 37 వ వర్ధంతి సందర్భంగా కేంద్ర రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు జొహరాపురం షద్రక్ నగర్ కొట్టాలలో సిపిఎం పార్టీ ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నగర కమిటీ సభ్యులు రంగస్వామి అధ్యక్షతన సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి అందరు నివాళు లర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం పార్టీ ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎం. రాజశేఖర్, నగర కార్యవర్గ సభ్యులు ఏం.విజయ్ నగర కమిటీ సభ్యులు మైమూద్ హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ కామ్రేడ్ సుందరయ్య అగ్రకుల భూస్వామ్య గా జన్మించిన పేద ప్రజల కార్మికుల అభివృద్ధి కోసం సొంత ఖర్చు తో సేవ చేస్తూ, దేశ స్వతంత్రం కోసం పీడిత వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేశాడని గుర్తుచేశాడు, రెడ్డి అనే పేరు వలన సామాన్య జనానికి దూరం కావాల్సి వస్తుందని రెడ్డి ని పక్కన పెట్టి సుందరయ్య సామాన్య జనంతో మమేకమై భూస్వామ్య , పెట్టుబడిదారీ వర్గం చేస్తున్న మోసానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగించాడు అన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో గాంధీజీ కాంగ్రెస్ పార్టీ ని అనుసరించి ప్రయోజనం లేదని తెలుసుకుని మార్క్సిస్టు నాయకుల సహకారంతో దేశంలో సోషలిజం ఏర్పాటు చేయాలని నిరంతరం కృషి చేశారని , చిన్నతనంలో ఆయన కుల వివక్షతకు వ్యతిరేకంగా తన కుటుంబం పైనే పోరాటం చేసి అందరూ సమానమేనని తెలియజేశాడు. భూస్వాములు వ్యవసాయ కార్మికులకు సరైన కూలి రేట్లు ఇవ్వడంలేదని , వ్యవసాయ కార్మికుల ఐక్యం చేసి పోరాటాల ద్వారా కూలి రేట్లు పెంచిన పోరాటయోధుడు అని అన్నారు. సాయుధ తెలంగాణా పోరాటం భూస్వాములకు రజాకార్లకు వ్యతిరేకంగా భూమికోసం భుక్తి కోసం జరుగుతున్న పోరాటంలో సుందరయ్య పాల్గొని పేదలకు భూమిని పంచిన గొప్ప ప్రజానాయకుడు అని కొనియాడారు. అసెంబ్లీ పార్లమెంట్ కు ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన ఆయన ప్రజాధనాన్ని ఎక్కడ దుర్వినియోగం చేయకుండా సైకిల్ పై చట్టసభలకు వెళ్లిన ఆదర్శ మూర్తి అని అన్నారు. పిల్లలు పుడితే స్వార్థం ఎక్కడ వస్తుందో అని ఆలోచించి పెళ్లికి ముందే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని సమాజమే తన పిల్లలుగా స్వీకరించిన ఆదర్శ దంపతులు లీల సుందరయ్య యని గుర్తు చేశారు. పార్లమెంటు అసెంబ్లీలను ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న పాలకవర్గం ఆయన మాట కోసం, ప్రశ్నల కోసం, ఉపన్యాసం కోసం ఎదురుచూసే వారన్నారు. రాష్ట్రంలో కరువు వచ్చిన ప్రభుత్వం పట్టించుకోకపోతే కరువు సెంటర్లను ఏర్పాటు చేసి పేద ప్రజలకు గంజి పోయించిన ఘనుడు అని గుర్తు చేశారు. రాష్ట్ర దేశ ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం సుందరయ్య వాలంటరీగా చాలా సేవలు అందించాలని గుర్తు చేశారు. తమ్ముడుని డాక్టర్ చదివించి పేదలకు ఉచిత వైద్యం అందించాలని సంకల్పంతో ప్రజా వైద్యశాలలు ఏర్పాటు చేసి సేవలు అందించాలని తెలియజేశారు. కాబట్టి సుందరయ్య ఆదర్శాన్ని, త్యాగనిరతిని, స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. జొహరాపురంలో రంగస్వామి అధ్యక్షతన, సివిల్ సప్లై గోదాంలో చంద్ర అధ్యక్షతన, సుర్జీత్ భవన్లో షరీఫ్ అధ్యక్షతన, బుధవార పేటఆఫీసులో రామకృష్ణ అధ్యక్షతన ఓపెన్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి కార్మికులను ప్రజలను చైతన్యం చేసి సుందరయ్య ఆశయం సోషలిజం సాధించాలని ఓపెన్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశామని అన్నారు, ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు అబ్దుల్ దేశాయ్, ఖాజా పాష, నాగరాజు, దాసు, సమ్సోన్, మధు, మాసుం, గిడ్డయ్య, ఉరుకుంద, మునిస్వామి, జనార్ధన్, జోసఫ్, కుమార్,ఇర్ఫాన్,మౌలాలి, ప్రకాష్, బజారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బొంది మడుగుల రైతుల గోడు పట్టని ప్రభుత్వ అధికారులు

పత్తికొండ మే 19 :- కర్నూలు జిల్లా తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామంలో చెరువును ఆనుకుని ఉన్న రైతులు ఏదైతే జరుగుతుంది బయపడ్డారో ఇప్పుడు అదే జరిగింది. హంద్రీనీవా చెరువులు నింపే కార్యక్రమంలో భాగంగా బొంది మడుగుల చెరువు ఆధునీకరణ చేపట్టారు. ఆ క్రమంలో పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ పనులు పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు రైతుల మొదటి నుండి మొర పెట్టుకుంటున్న విన్నపాన్ని పెడచెవిన పెట్టారు.ఆ క్రమంలో తమ పొలాలకు బండ్ల రాస్త విషయం లో అదేవిధంగా వర్షపు నీరు చెరువులోకి పోవడానికి రైతు పొలాలలో సిమెంటు పైపులు ఏర్పాటు చేయాలని... పోయిన నెలలో చెరువులోనే ధర్నా చేపట్టారు.. ఒక రోజు పనులు కూడా నిలిపి వేశారు.ఆ తర్వాత కర్నూలు జిల్లా కలెక్టర్ గారికి గత వారం లో స్పందన లో తమ సమస్య గురించి విన్నవించారు. స్పందనలో ఇచ్చిన అర్జీ కి కర్నూలు జిల్లా మైనర్ ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు రైతుల పొలాల్లో ప్రతి చోట నీరు చెరువు లోకి పోవడానికి ఏర్పాటు చేశామని అదేవిధంగా అక్కడ రైతులకు పంట పొలాలలోకి వెళ్ళడానికి రాస్త లేదంటూ స్పందన అర్జీ కి సమాధానమిచ్చారు. అయితే ఒకప్పుడు చెరువు వెనుకభాగం లో ఒకప్పుడు కొత్తపల్లి అనే గ్రామం ఉండేది.. ఆ కొత్తపల్లి నుండి బొందిమడుగుల కు చెరువుల ఆనుకుని బండ్ల రాస్త వుంది అనే విషయం చాలా స్పష్టంగా



ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల లో ఉంది. అయినప్పటికీ మైనర్ ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు స్పందన అర్జీ కి తప్పుడు సమాధానం ఇచ్చారు. అయితే ఇప్పుడు నిన్నటి నుండి కురిసిన వర్షాలకు చెరువులోకి పోవాల్సిన నీరు రైతుల పొలాల్లోనే నిలిచిపోయింది.

# ఫ్యూచర్ మాస్ సూపర్ స్టార్ రౌడీ స్టారేనా?



ఎలాంటి అంచనాలు లేకుండా సైలెంట్ గా విడుదలై పాథ్ బ్రేకింగ్ బ్లాక్ బస్టర్ గా నిలిచిన మూవీ 'అర్జున్ రెడ్డి'. ఈ సినిమాతో విజయ్ దేవరకొండ స్టార్ హీరోల జాబితాలో చేరిపోయాడు. తన క్రేజ్ నే బ్రాండ్ ఇమేజ్ గా మలుచుకుని ఓ బ్రాండ్ ని క్రియేట్ చేసుకోవడమే కాకుండా యూత్ లో భారీ క్రేజ్ని ఫాన్ ఫాలోయింగ్ ని సొంతం చేసుకున్నాడు. 'అర్జున్ రెడ్డి' బ్లాక్ బస్టర్ గా నిలవడంతో చాలా వరకు ఇండస్ట్రీ లెక్కలు మారిపోయాయి.ఆ తరువాత చేసిన చిత్రాలు కూడా విజయ్ దేవరకొండ క్రేజ్ ని రోజు రోజుకీ పెంచుతూ పోయాయే కానీ ఎక్కడా తగ్గించలేదు. మెగాస్టార్ చిరంజీ సూపర్ స్టార్ మహేష్ బాబు ల తరువాత థమ్స్ అప్ యాడ్ ని సొంతం చేసుకున్న హీరోగా విజయ్ దేవరకొండ సరికొత్త రికార్డుని సొంతం చేసుకుని ఔరా అనిపించాడు. చేసింది కేవలం 9 సినిమాలే అందులో క్రేజీ హిట్ లు బ్లాక్ బస్టర్ లు తక్కువే అయినా విజయ్ దేవరకొండ కున్న క్రేజ్ మాత్రం చాలా ఎక్కువ. అదే అతన్ని థమ్స్ అప్ యాడ్ కు బ్రాండ్ అంబాసిడర్ అయ్యేలా చేసింది.ప్రస్తుతం 'లైగర్' సినిమాతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తున్న విజయ్ దేవరకొండ ఇదే సినిమాతో పాన్ ఇండియా మార్కెట్ ని కూడా టార్గెట్ చేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.ఈ మూవీ ఆగస్టులో ఏకంగా ఐదు భాషల్లో భారీ స్థాయిలో విడుదల కాబోతోంది. పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో కరణ్ జోహార్ అపూర్వ మెహతా చార్మిలతో కలిసి పూరి జగన్నాథ్ ఈ మూవీని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఆగస్టులో ఈ చిత్రం పాన్ ఇండియా వైడ్ గా విడుదల కాబోతోంది.తాజాగా ఈ మూవీ గ్లింప్స్ ఖుషీ మోషన్ పోస్టర్ 24 గంట్లో సాధించిన రికార్డ్ స్థాయి వ్యూస్ ని చూస్తే ఫ్యూచర్ మాస్ సూపర్ స్టార్ రౌడీ స్టారేనా? అనే భావన ప్రతీ ఒక్కరిలోనూ కలగక మానదు. లైగర్ గ్లింప్స్ 24 గంటల్లోనే ఇండియాలో అత్యధికంగా వీక్షించి 16 మిలియన్ ల వ్యూస్ ని సాధించి రికార్డు సృష్టించింది. ఇక ఇటీవల శివ నిర్వాణ డైరెక్షన్ లో విజయ్ దేవరకొండ నటిస్తున్న మూవీ 'ఖుషీ'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. సమంత హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీ టైటిల్ మోషన్ పోస్టర్ ని సోమవారం విడుదల చేసిన విషయం తెలిసిందే.24 గంటల్లోనే 'ఖుషీ' మూవీ టైటిల్ మోషన్ పోస్టర్ 24 గంటల్లోనే 2.59 మిలియన్ ల వ్యూస్ ని సాధించి అత్యధిక వ్యూస్ ని రాబట్టిన మోషన్ పోస్టర్ లలో 3వ స్థానాన్ని సొంతం చేసుకుని ఆశ్చర్యపరిచింది. ఈ క్రేజ్ మాస్ ఫాలోయింగ్ వున్న వాళ్లకే సాధ్యం అవుతుంది. దీన్ని బట్టి విజయ్ దేవరకొండ ఫ్యూచర్ మాస్ సూపర్ స్టార్ గా అవతరించడం ఖాయంగా కనిపిస్తోంది. అతని దూకుడుని ఎవరూ ఆపలేరని కూడా స్పష్టం అవుతోందని ఇన్ సైడ్ టాక్.

# బుట్టబొమ్మని విక్టరీకి చెల్లిని చేసేశారు

విక్టరీ వెంకటేష్ యంగ్ హీరో వరుణ్ తేజ్ తో కలిసి నటించిన ఫన్ ఎంటర్ టైనర్ 'ఎఫ్ 3'. అనిల్ రావిపూడి హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కించిన ఈ మూవీని స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు శిరీష్ సంయుక్తంగా నిర్మించారు.తమన్నా మెహ్రీన్ హీరోయిన్ లుగా నటించిన ఈ చిత్రంలో సోనాల్ చౌహాన్ అంజలి సునీల్ ప్రత్యేక పాత్రల్లో నటించారు. క్రేజీ కాస్టింగ్ తో ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా రూపొందిన ఈ మూవీ మే 27న భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.ఇదిలా వుంటే ఈ మూవీతో పాటు నెట్ ఫ్లిక్స్ కోసం 'రానా నాయుడు' పేరుతో ఓ భారీ వెబ్ సిరీస్ చేస్తున్న విషయం తెలిసిందే. రానా కూడా కీలక పాత్రలో నటిస్తున్న ఈ వెబ్ యాక్షన్ డ్రామా షూటింగ్ గత కొంత కాలంగా ముంబైలో జరుగుతోంది. అక్కడే వుంటూ ఈ వెబ్ సిరీస్ షూటింగ్ ని పూర్తి చేస్తున్న విక్టరీ వెంకటేష్ ఇదే ఏడాది బాలీవుడ్ మూవీ కూడా చేయబోతున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా ఇటీవలే బయటికి వచ్చేసింది.బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ హీరోగా ఫర్హాద్ సామ్జి ఓ భారీ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాని తెరపైకి తీసుకురాబోతున్నారు. 'కభీ ఈద్ కభీ దివాళీ' పేరుతో రూపొందుతున్న ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. సల్మాన్ ఖాన్ నటిస్తూ నిర్మిస్తున్నారు.



ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ ముంబైలోని విలే పార్లేలో వేసిన ప్రత్యేక సెట్ లో జరుగుతోంది. ఇందులో విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. బుట్టబొమ్మ పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తోంది.ఇదిలా వుంటే ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్ డేట్ ఆకట్టుకుంటోంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ బుట్టబొమ్మ పూజా హెగ్డే అన్నా చెల్లెళ్లుగా కనిపిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. సినిమాలో వీరిద్దరి మధ్య వున్న అనుబంధం వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్స్ గా నిలుస్తాయని తెలుస్తోంది. పూజా హెగ్డే ఇటీవలే ఈ మూవీ షూటింగ్ లోకి ఎంటరైంది. విక్టరీ వెంకటేష్ వచ్చే నెల నుంచి ఈ మూవీ షూటింగ్ లో పాల్గొనబోతున్నారు. భారీ అంచనాలు నెలకొన్న ఈ మూవీని డిసెంబర్ 30న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారట.ఇటీవల విక్టరీ వెంకటేష్ వరుణ్ తేజ్ కలిసి నటిస్తున్న ఫ్యామిలీ ఫన్ రైడ్ 'ఎఫ్ 3' కోసం పూజా హెగ్డే పాల్గొనగా విక్టరీ వెంకటేష్ వరుణ్ తేజ్ లపై ఓ ప్రత్యేక గీతాన్ని షూట్ చేశారు. ఆ సాంగ్ ని ఇటీవలే విడుదల చేశారు. కూడా. అప్పుడే బుట్టబొమ్మని విక్టరీ వెంకటేష్ కు చెల్లెలిని చేయడం తో వెంకీ ఫ్యాన్స్ షాకవుతున్నారట.

# మహేష్ త్రివిక్రమ్.. ఓ పుట్టిన రోజు కానుక

సూపర్ స్టార్ మహేష్ బాబు సర్కారు వారి పాట సినిమా తో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. భారీ అంచనాల నడుమ రూపొందిన సర్కారు వారి పాటకు నెగటివ్ కామెంట్స్ వచ్చినా వసూళ్ల విషయంలో చాలా పాజిటివిటీ కనిపిస్తోంది. పరశురామ్ దర్శకత్వంలో రూపొందిన సర్కారు వారి పాట సినిమా వస్తున్న వసూళ్ల నేపథ్యంలో హిట్ మూవీ అనే ముద్ర పడింది. ఇప్పుడు మహేష్ బాబు తదుపరి సినిమాపై చర్చ ప్రారంభం అయ్యింది.మహేష్ బాబు తదుపరి సినిమా త్రివిక్రమ్ దర్శకత్వంలో అనే విషయం తెల్సిందే. వీరిద్దరి కాంబోలో గతంలో అతడు మరియు ఖలేజా సినిమాలు వచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమాలు థియేట్రికల్ రిలీజ్ లో డిజాస్టర్స్ గా నిలిచాయి. కాని శాటిలైట్ టెలికాస్ట్ లో మాత్రం బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్ గా నిలిచాయి. ఇప్పటికి అతడు సినిమా వస్తే మంచి రేటింగ్.. ఫ్యూవర్ షిప్ వస్తుందట. అందుకే వీరిద్దరి కాంబోలో మూడవ సినిమా కోసం ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఉన్నారు.ఇప్పటికే మహేష్ బాబు.. త్రివిక్రమ్ మూవీ కన్ఫర్మ్ అయ్యింది. గత ఏడాదిలోనే షూటింగ్ ప్రారంభం అవ్వాల్సి ఉంది. కరోనా వల్ల ఆలస్యం అవుతూ వచ్చింది. ఈ ఏడాది ఆరంభంలో అయినా మహేష్ మూవీని పట్టాలెక్కించాలని త్రివిక్రమ్ భావించాడు.కాని కొన్ని కారణాల వల్ల సర్కారు వారి పాట సినిమా విడుదల ఆలస్యం అయ్యింది. ఎట్టకేలకు సర్కారు వారి పాట విడుదల అవ్వడంతో త్రివిక్రమ్ పనులు మొదలు పెట్టాడు.విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం జూన్ చివర్లో లేదా జులై ఆరంభంలో సినిమా షూటింగ్ ను మొదలు పెట్టాలనుకుంటున్నారట. అందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయట. ఈ లోపు సూపర్ స్టార్ కృష్ణ పుట్టిన రోజు అయిన మే 31వ తారీకున సినిమాకు సంబంధించిన అప్డేట్ ఇవ్వబోతున్నారట.



ఆ రోజు సినిమా ఫస్ట్ లుక్ ను రివీల్ చేస్తారనే వార్తలు వస్తున్నాయి.ఈ సినిమాకు పార్థు అనే టైటిల్ ను మేకర్స్ పరిశీలిస్తున్నారు అనే వార్తలు వస్తున్నాయి. మే 31వ తారీకున టైటిల్ విషయంలో కూడా ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఇప్పటికే సినిమా పూజా కార్యక్రమాలు జరిగాయి.. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను అధికారికంగా యూనిట్ సభ్యులు వెల్లడించే అవకాశం ఉందంటున్నారు. మొత్తానికి సూపర్ స్టార్ కృష్ణ బర్త్ డే రోజు ఖచ్చితంగా మహేష్.. త్రివిక్రమ్ ల కాంబో మూవీ అప్డేట్ రావడం కన్ఫర్మ్.

# కుటుంబానికి నేనే ఆధారం.. అప్పుడు మా నాన్న 2-3 రోజులు భోజనం చేయలేదు.. కానీ!



"ఆ ఐదేళ్ల కాలం నా జీవితంలో అత్యంత క్లిష్టమైనది. కేకేఆర్ నన్ను కొనుగోలు చేసి.. ఆడే అవకాశం ఇచ్చిన సమయంలో రాణించలేకపోయాను. మొదటి ఏడాది విఫలమైనా సరే నాపై నమ్మకం ఉంచి కేకేఆర్ రెండేళ్ల పాటు నన్ను రిటైన్ చేసుకుంది" అంటూ గత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ కోల్‌కతా నైట్‌రైడర్స్ యువ ఆటగాడు రింకూ సింగ్ ఉద్వేగానికి లోనయ్యాడు.?కాగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీఘర్‌కు చెందిన రింకూ సింగ్‌ది పేద కుటుంబం. జీవనోపాధి కోసం ఒకానొక సమయంలో స్వీపర్‌గా కూడా పనిచేసిన రింకూ ఒక్కో మెట్టు ఎదుగుతూ క్రికెటర్‌గా తనను తాను నిరూపించుకున్నాడు. దేశవాళీ టోర్నీల్లో ప్రదర్శనతో కేకేఆర్ దృష్టిని ఆకర్షించి 2018లో ఐపీఎల్‌లో అడుగుపెట్టాడు. అయితే ఆరంభంలో అతడికి పెద్దగా ఆడే అవకాశం రాలేదు. ఐపీఎల్-2022లో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న 24 ఏళ్ల రింకూ ఆడిన 7 మ్యాచ్‌లలో 174 పరుగులు చేశాడు. జట్టుకు అవసరమైన సమయంలో రాణించి తన విలువను చాటుకున్నాడు. ఇక లక్నో సూపర్‌జెయింట్స్‌తో కీలకమైన ఆఖరి మ్యాచ్‌లోనూ రింకూ బ్యాట్ ఝులిపించాడు. కానీ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయాడు. దీంతో 2 పరుగుల తేడాతో ఓటమి పాలై కేకేఆర్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.ఈ నేపథ్యంలో రింకూ సింగ్ మాట్లాడుతూ తన కుటుంబ నేపథ్యం, ఫ్రాంచైజీతో తన అనుబంధం గురించి చెప్పుకొచ్చాడు. "గతేడాది విజయ్ హజారే ట్రోఫీ సమయంలో పరుగు తీసే క్రమంలో నేను గాయపడ్డాను. అప్పుడు ఐపీఎల్ గురించిన ఆలోచనలే నన్ను వెంటాడాయి. నాకు ఆపరేషన్ అవసరమని, కోలుకోవడానికి 6 నుంచి 7 నెలల సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. ఆటకు అన్ని రోజులు దూరంగా ఉండాలంటే నా వల్ల కాలేదు.నేను గాయపడటం నాన్నను ఎంతో బాధించింది. ఆయన రెండు మూడు రోజుల పాటు అసలు భోజనం చేయలేదు. క్రికెట్‌లో గాయాలు కామన్ అని నాన్నకు చెప్పాను. అయితే, మా కుటుంబం మొత్తం నా మీదే ఆధారపడి ఉంది కదా! మాలాంటి వాళ్ల జీవితాల్లో ఇలాంటివి జరగడం నిజంగా ఆందోళనను రేకెత్తిస్తాయి.నాన్న అలా ఉండటం చూసి నేను బాధపడ్డాను. అయితే, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి త్వరగానే కోలుకున్నాను" అని రింకూ తెలిపాడు. ఆరంభంలో విఫలమైనా కేకేఆర్ తనపై నమ్మకం ఉంచి అవకాశాలు ఇచ్చిందని కృతజ్ఞతాభావం చాటుకున్నాడు. ఇక లక్నోతో మ్యాచ్‌లో రింకూ సింగ్ విలువైన ఇన్నింగ్స్(15 బంతుల్లో 40 పరుగులు) ఆడిన విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190